

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

10.08.2026

సోమవారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 89

పేజీలు : 8 |వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


### మమతా బెనర్జీ కాన్వాయ్‌పై

## చెప్పులతో దాడి

- బెంగాల్‌లో తీవ్ర ఉద్రిక్తత
- బురదతో నిరసనకారులు దాడి
- తనను చంపేసే వారంటూ మమత ఆగ్రహం




కోల్‌కతా, ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రికి నిరసన సెగ ఎదురైంది. 5లో..

## మెడికో ప్రియాంక మృతి

- రాజమండ్రి ఘటనలో గాయపడిన యువతి
- కిమ్స్ ఆస్పత్రి వైద్యుల ధ్రువీకరణ
- ఇద్దరు నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్
- మద్యం మత్తులో ప్రమాదం
- ప్రియాంక మృతి కలచివేస్తోంది.. కఠిన శిక్షలు పడేలా చూస్తాం: చంద్రబాబు 2లో..





హైదరాబాద్, ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్

రాజమహేంద్రవరం ఘటనలోగాయపడిన మెడికల్ స్టూడెంట్ ప్రియాంకకన్నుమూశారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ప్రియాంక.. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల 25 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లు ధ్రువీకరించారు. ప్రియాంకకు ఆప్నియా టెస్ట్ చేసేందుకు వైద్యులు ప్రయత్నించగా.. ఆమె శరీరం అందుకు సహకరించని సంగతి తెలిసిందే. ఆమె ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారగా.. ఆదివారం మధ్యాహ్నం సమయంలో కన్నుమూశారు.

# అవకాశాలు కల్పిస్తే.. అద్భుతాలు

- ఆ సామర్థ్యం ఆదివాసీలకు ఉంది
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- గిరిజన బిడ్డలు చదువుకొని ఐఐటీలకు వెళ్లాలి
- తద్వారా దేశానికి ఉపయోగపడాలి
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం
- డప్పు కొట్టి.. బాలికలతో కాసేపు నృత్యం
- దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన రావాలి

విజయవాడ, ఆగస్ట్ 09, అనంతజనశక్తి న్యూస్

అవకాశాలు కల్పిస్తే.. అద్భుతాలు చేయగల సామర్థ్యం ఆదివాసీలకు ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. గిరిజన బిడ్డలు బాగా చదువుకొని ఐఐటీలకు వెళ్లాలని.. తద్వారా దేశానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. కొమ్ము, బంజారా, థింసా నృత్యాలతో గిరిజనులు ఆయనకు స్వాగతం పలికారు.




ఈ సందర్భంగా చంద్రబాబు డప్పు కొట్టి.. బాలికలతో కాసేపు నృత్యం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు సమక్షంలో వివిధ ప్రైవేటు సంస్థలతో గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "దేశం మనకు ఏమిచ్చిందనేది కాకుండా.. దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన రావాలి. అరకు కాఫీని ప్రోత్సహించి ప్రపంచస్థాయికి తీసుకెళ్తున్నాం. పార్లమెంట్‌లోనూ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించాం. దీన్ని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం. అరకు కాఫీ బాగుందని ప్రధాని మోదీ కితాబిచ్చారు. మన్‌కీ బాత్‌లోనూ దీని గురించి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ గిరిజనులకు న్యాయం చేసిన తొలిపార్టీ తెదేపా. గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకే ఉద్యోగాలు దక్కాలని జీవో నంబర్ 3 తీసుకొచ్చాం. 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన ఈ జీవో సుమారు 20 ఏళ్లు అమల్లో ఉంది. వైకాపా హయాంలో 2020లో సుప్రీంకోర్టు దీన్ని కొట్టివేసింది. సుప్రీంకోర్టు జీవో నంబర్ 3ను కొట్టివేస్తే వైకాపా ప్రభుత్వం సరిగా డిఫెండ్ చేయలేకపోయింది. గిరిజనులకు లబ్ధి చేకూరేలా మళ్లీ అందరికీ ఆమోదయోగ్యమైన విధానం తీసుకొస్తాం. 2లో..

### పోరాట యోధుడు

## కుమ్రం భీం

- జల్, జంగల్, జమీన్
- నినదించిన కుమ్రం భీం
- అవే ఆయన తెగువకు ప్రతిరూపాలు: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్ట్ 09, అనంత జనశక్తి న్యూస్ 5లో..

ప్రకృతి పరిరక్షకులు, విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ఆదివాసీలు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడవులను, చెట్లను, పుట్టలను, జంతువులను ప్రేమించే, పూజించే ఆదివాసీలు... 'జల్, జంగల్, జమీన్' అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు అని తెలిపారు.



## బీజేపీని మెప్పించే వ్యాఖ్యలు వద్దు

- శశి థరూర్‌పై కాంగ్రెస్ ఫైర్ 2లో..
- రాహుల్ కార్యక్రమానికి, సీజేపీకి వచ్చిన మద్దతు రాలేదని కామెంట్స్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 09, అనంతజనశక్తి న్యూస్

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో మరోసారి వివాదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. పార్టీ నేతలు బహిరంగంగా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, బీజేపీకి రాజకీయంగా ఉపయోగపడే వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. మహారాష్ట్రలో జరిగిన ఒక కార్యక్రమంలో శశి థరూర్ మాట్లాడారు.

## అమెరికాలో ఓ వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేశ్



గ్లోబల్ ఎన్ఆర్ఐ చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహ వేడుక అమెరికాలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. లోకేశ్ దంపతులు తమ కుటుంబ వివాహ వేడుకకు హాజరు కావడంతో డాక్టర్ రాజా కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి, బిజీ షెడ్యూల్‌లోనూ ప్రత్యేకంగా సమయం కేటాయించి అమెరికా వచ్చి వివాహ వేడుకలో పాల్గొన్న లోకేశ్‌కు.. డాక్టర్ రాజా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## మీ పోరాటమే.. మా పోరాటం

- మీరు ఈ ప్రభుత్వ ద్రోహాన్ని గమనించండి
- విద్యార్థులతో మాజీ మంత్రి హరీశ్‌రావు 2లో..
- మేము సమాజానికి ఏం చేయగలం అని ఆలోచించాలి

సిద్దిపేట, ఆగస్ట్ 09, అనంతజనశక్తి న్యూస్

సిద్దిపేటలో నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దళిత విద్యార్థులకు అవార్డులు అందజేసి, వారిని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ లాంటి మహనీయులు కల్పించిన రిజర్వేషన్ల వల్లే మనమంతా చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నామని తెలిపారు. ఆ రిజర్వేషన్ల ఫలాలతో గౌరవంగా బతుకుతున్న మనం తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయాలనే బాధ్యతను పదేళ్ల క్రితమే గుర్తించి సిద్దిపేటలో మాదిగ సామాజిక వర్గం ఉద్యోగులంతా కలిసి 'న్యూస్' సొసైటీని స్థాపించడం అభినందనీయమని కొనియాడారు. నాకు సమాజం ఏం చేసింది అని అడిగేవాళ్లే ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో, మేము సమాజానికి ఏం చేయగలం అని ఆలోచించి, ఉద్యోగులు తమ వేతనం నుంచి ప్రతినెలా వెయ్యి రూపాయలు పక్కనపెట్టి 10 లక్షల రూపాయల నిధిని ఏర్పాటు చేయడం గర్వకారణమని హరీశ్‌రావు అన్నారు.



## ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయి



- అందుకే రాజీనామా చేశా
- రాజీనామా తర్వాత తొలిసారి కామెంట్
- మాజీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2లో..

న్యూఢిల్లీ, ఆగస్ట్ 09, అనంతజనశక్తి న్యూస్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వివాదంపై కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి, సంబల్‌పూర్ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా బహిరంగంగా స్పందించారు. ఈ నిరసనల సమయంలో 'జెన్ జీ'ని ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## డీలిమిటేషన్ బిల్లుపై కలిసి అభిప్రాయం చెప్తాం

- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే 2లో..
- మహిళా రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న అంశం



న్యూఢిల్లీ, ఆగస్ట్ 09, అనంతజనశక్తి న్యూస్

మహిళా రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉమ్మడి నిర్ణయం తీసుకుంటాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్ పర్యటనలో భాగంగా రుద్రపూర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ అంశంపై కాంగ్రెస్ వైఖరి చాలా స్పష్టంగా ఉందన్నారు.

## క్విట్ ఇండియా గొప్పతనాన్ని.. యువత తెలుసుకోవాలి

- మెడలు వంచక తప్పదు
- ప్రజాస్వామ్యంలో ఎంతటి వారైనా సరే..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్, ఆగస్ట్ 09, అనంతజనశక్తి న్యూస్

క్విట్ ఇండియా గొప్పతనాన్ని యువతరం తెలుసుకోవాల్సి ఉందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా కీలక ఘట్టమని అభివర్ణించారు. ఆదివారం నాంపల్లిలోని గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. 2లో..

# డీలిమిటేషన్ బిల్లుపై కలిసి అభిప్రాయం చెప్తాం



(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల లోక్‌సభలో వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లుపై ప్రభుత్వం మళ్లీ ముందుకు వెళ్లాలని చూస్తే, ప్రతిపక్షాల ఫ్లోర్ లీడర్ల సమావేశంలో చర్చించి ఉమ్మడి వ్యూహాన్ని ప్రకటిస్తామని ఖర్గే తెలిపారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా, ప్రస్తుతం ఉన్న 543 సీట్లలోనే మహిళలకు మూడో వంతు (1/3వంతు) రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఖర్గే చెప్పారు. ఈ బిల్లుపై డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్, మిజోరం సీఎం లాల్‌దుహోమాతో పాటు పలు మైనారిటీ క్రైస్తవ వర్గాల ప్రతినిధులు ఇప్పటికే తమ అభ్యంతరాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు తెలియజేశారని ఖర్గే చెప్పారు. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేందుకే తాను ఇక్కడ పర్యటిస్తున్నట్లు ఖర్గే పేర్కొన్నారు.

సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు లేదా దక్షిణ భారత దేశానికి లబ్ధి జరగదని, ఇది కేవలం సెంట్రల్ ఇండియాకే ప్రయోజనం చేకూరుస్తుందని కాంగ్రెస్ నేత మనీష్ తివారీ వ్యాఖ్యానించారు. సీట్లను 850కి పెంచితే లోక్‌సభ చైనా 'నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్'లా తయారవుతుందని తివారీ విమర్శించారు.

# అవకాశాలు కల్పిస్తే.. అద్భుతాలు



(మొదటిపేజీ తరువాయి)

మా ప్రభుత్వం గిరిజనుల హక్కుల కోసం పోరాడుతుంది. గిరిజన బిడ్డలు ఆవేశానికి లోనుకాకుండా ఆలోచన చేయాలి'' అని చంద్రబాబు అన్నారు.

రాష్ట్రంలో 29 లక్షల మంది గిరిజనులు ఉన్నారని, వారి అభ్యున్నతికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని సీఎం తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తొమ్మిది ఐటీడీఏ కేంద్రాల అభివృద్ధితో మంచి ఫలితాలు వస్తాయని, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, కనెక్టివిటీ సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని చెప్పారు. 2027 డిసెంబరు నాటికి గిరిజనులందరికీ ఇళ్లు, సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని, టెలీకమ్యూనికేషన్స్ సంస్థలతో ఒప్పందం చేసుకుని గిరిజన గ్రామాలకు వేగంగా కనెక్టివిటీ కల్పిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

**ఎల్‌నినో వేళ పంటలకు పట్టిసీమ నీరే జీవాధారం**

పట్టిసీమ నీటితో కృష్ణా డెల్టా కళకళలాడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎల్‌నినో వేళ పంటలకు పట్టిసీమ నీరే జీవాధారమని పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు 17 టీఎంసీల నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. గోదావరి నీటితో నిండుకుండలా బ్యారేజ్ ఉందని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళ్తున్న సమయంలో బ్యారేజ్‌పై కాసేపు తన వాహన కాన్వాయ్‌ను సీఎం నిలిపారు. ప్రకాశం బ్యారేజ్‌లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. పట్టిసీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని తిలకించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు.

పట్టిసీమ ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు..

గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సీఎం తెలిపారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.52 టీఎంసీల నీటిని కృష్ణానదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు సీఎంకు అధికారులు వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

**సాగునీటి ఇబ్బందులను అధిగమించాలి..**

కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్ నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వివరించారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయపడ్డారు. సమర్థంగా నీటి నిర్వహణ ద్వారా ఎల్‌నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు అన్నివిధాలా పనిచేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# బీజేపీని మెప్పించే వ్యాఖ్యలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)



రాహుల్ గాంధీ నిర్వహించిన ''ఛాత్రోం కీ గూంజ్'' కార్యక్రమానికి, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కి వచ్చినంత స్పందన రాలేదని, కాంగ్రెస్ దీనిపై ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్యానించారు. థరూర్ చేసిన వ్యాఖ్యలపై వేణు గోపాల్ స్పందిస్తూ.. తాను ఈ వ్యాఖ్యల్ని మీడియా కథనాల్లో చూశానని, పూర్తి సందర్భం వినలేదని చెప్పారు. థరూర్ తన వ్యాఖ్యలపై స్వయంగా వివరణ ఇవ్వాలని సూచించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ''కాంగ్రెస్ సభ్యులు ఎప్పుడూ పార్టీ విధానాలు, క్రమశిక్షణ పాటించకపోయినా.. బీజేపీని మెప్పించేలా వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్త పడాలి'' అని కేసీ వేణుగోపాల్ అన్నారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేసే అవకాశం దొరికితే బీజేపీ సంతోషిస్తుందని అన్నారు. థరూర్ ఉద్దేశపూర్వకంగా ఈ వ్యాఖ్యలు చేశారని తాను భావించడం లేదని చెప్పారు.

ఇదే సమయంలో రాహుల్ గాంధీ జెన్‌జీ యువతను ఆకట్టుకునేందుకు నిర్వహిస్తున్న విద్యార్థి కార్యక్రమానికి కేసీ వేణుగోపాల్ మద్దతు ఇచ్చారు. యూపీ అలహాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి సాధారణ కార్యకర్తలే కాకుండా పెద్ద సంఖ్యలో యువత వచ్చిందని అన్నారు. కోటా, డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమాల్లో కూడా ఇదే తరహా స్పందన కనిపించిందని అన్నారు. అలహాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు యూపీ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు.

# క్విట్ ఇండియా గొప్పతనాన్ని.. యువత తెలుసుకోవాలి



(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టు 8వ తేదీన మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుతో యావత్ భారతదేశం కదం తొక్కిందని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతోపాటు సుభాష్ చంద్రబోస్.. ఈ క్విట్ ఇండియా ఉద్యమానికి స్ఫూర్తి అని తెలంగాణ పీసీసీ చీఫ్ గుర్తు చేశారు. బ్రిటిష్‌వాళ్లు భారత్ విడిచి వెళ్ళిపోవడానికి ఈ ఉద్యమమే ప్రధాన కారణమని వివరించారు. కేంద్రం మొండి వైఖరికి వ్యతిరేకంగా జెన్ జీ ఉద్యమం చేపట్టిందని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమం గురించి తెలుసుకోవాలని జెన్ జీ ఉద్యమ వీరులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది సర్వం కోల్పోయి ప్రాణత్యాగాలు చేస్తేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తు చేశారు.

అయితే ప్రస్తుతం దేశంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని నెహ్రూను మరిపించే ప్రయత్నం జరుగుతుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్ పటేల్‌ను బీజేపీ సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే వారికి క్విట్ చెప్పాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎంతటి వారైనా మెడలు వంచక తప్పదని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావటానికి గల కారణాలను యువత అధ్యయనం చేయాలని అభిప్రాయపడ్డారు. దేశం ఆశ్చర్యం పోయేలా తెలంగాణలో అభివృది, సంక్షేమం జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉందని.. ఆ సమయంలో రాష్ట్రాన్ని ఏం ఉద్ధరించలేదని విమర్శించారు. ఉద్యోగాల విషయంలో బీఆర్ఎస్ నేతల చేస్తున్న ప్రగల్భాలు హాస్యాస్పదమని అన్నారు. సద్విమర్శ చేయండి.. అంతే కానీ అసత్యాలు మాట్లాడకండంటూ ప్రతిపక్షాలను తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

అభివృధి, సంక్షేమం.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొస్తుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యకర్తల కష్టాన్ని మరిచిపోమని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సర్ ప్రక్రియలో ఓట్లు తొలగించే కార్యక్రమం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపును అడ్డుకొని అర్హత కలిగిన ఓటును కాపాడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కుల వివక్ష లేకుండా పోరాటం చేస్తున్నామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# మెడికో ప్రియాంక మృతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఏక్లాస్‌పూర్. ప్రియాంక తల్లిదండ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రియాంక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఓ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ విభాగంలో పీజీ చేస్తున్నారు. ఆగస్ట్ మూడో తేదీ రాత్రి రాజమహేంద్రవరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌లో మూవీ చూసిన ప్రియాంక.. ఆ తర్వాత స్నేహితుడితో కలిసి అక్కడి నుంచి బైక్ మీద బయల్దేరారు. అయితే ఆదిత్య మాల్ గేట్ వద్ద ఆగి ఉన్న సమయంలో నామవరానికి చెందిన దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆండ్రూ విలియం జోసెఫ్ అనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో ప్రియాంక ప్రయాణిస్తున్న స్కూటీని మూడుసార్లు ఢీకొట్టారు.

ఆ తర్వాత ఆమె పైనుంచి కారును పోనిచ్చారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆగస్ట్ ఐదో తేదీ సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించటంతో ఆదివారం మధ్యాహ్నం మూడున్నర సమయంలో ప్రియాంక కన్నుమూశారు.



మరికొన్ని రోజులలో డాక్టర్‌గా సేవలు అందిస్తుందనుకున్న కుమార్తె.. కళ్ల ముందు ఇలా విగతజీవిగా పడి ఉండటం చూసి ప్రియాంక తండ్రి కన్నీరుమున్నీరవుతున్నారు.

మరోవైపు ఈ కేసులో దుష్యంత్, ఆండ్రూ విలియం జోసెఫ్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నిందితులు మద్యం తాగి కారు నడిపినట్లు ఆధారాలు సేకరించామన్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్.. వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఆదివారం వెల్లడించారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయమైన ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. నిందితులను కస్టడీకి అనుమతించాలని కోరుతూ సోమవారం కోర్టులో పిటిషన్ వేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

**ప్రియాంక మృతి కలచివేస్తోంది.. కఠిన శిక్షలు పడేలా చూస్తాం: చంద్రబాబు**

మెడికో ప్రియాంక మృతిపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రియాంక మరణించిందన్న వార్త తీవ్ర విచారం కలిగించిందన్న చంద్రబాబు.. ఎంతో భవిష్యత్ ఉన్న తను ఇలా ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోందన్నారు. దీనికి కారణమైన వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామంటూ హామీ ఇచ్చారు. ప్రియాంక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చంద్రబాబు ట్వీట్ చేశారు. "రాజమండ్రిలో యువకులు తీవ్ర నిర్లక్ష్యంతో, మద్యం మత్తులో కారుతో ఢీ కొట్టిన ఘటనలో గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందిందనే వార్త తీవ్ర విచారం కలిగించింది. ఎంతో భవిష్యత్ ఉన్న ఒక వైద్య విద్యార్థిని ఇలా ప్రాణాలు కోల్పోవడం నన్ను కలిచివేస్తోంది. ఈ ఘటన అత్యంత బాధాకరం. ప్రియాంక మృతికి కారణమైన వారు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్నారు. తమ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం తీసిన వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తాం. ఈ విషయంలో పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాము. కఠిన సెక్షన్లతో నిందితులకు శిక్షలు పడేలా చూస్తాం. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేస్తున్నాను." అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

# ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయి

(మొదటిపేజీ తరువాయి)

ఆ వివాదం కారణంగానే తాను కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ విద్యార్థుల భారీ నిరసనల మధ్య జూలై 25వ తేదీన ఆయన తన మంత్రి పదవి నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. సరిగ్గా రెండు వారాల తర్వాత భువనేశ్వర్‌లోని జీఎం విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**పదవి కన్నా యువత భవిష్యత్తే ముఖ్యం..!**

నీట్ అభ్యర్థులు, ప్రస్తుత తరం యువతను ఉద్దేశించి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ధర్నాలు చేసిన జెన్ జీలు కూడా మన పిల్లలే. కానీ కొందరు కావాలనే వారిని తప్పుదోవ పట్టించారు. అప్పట్లో నాకు ఎలాంటి వ్యక్తిగత సమస్యలు లేవు. భారత దేశంలో ప్రతి ఏడాదీ కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారు. గత పదేళ్ల లెక్కలు తీసుకుంటే 20 కోట్ల మంది పిల్లలు పుట్టారు. వారందరికీ ఎన్నో ఉన్నతమైన ఆకాంక్షలు ఉంటాయి. వారే భవిష్యత్తులో భారతదేశాన్ని విశ్వ గురుగా నిలబెడతారు. అందుకే నాకు పదవి ఏమాత్రం ముఖ్యం కాదు" అని ప్రధాన్ వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే తాను స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి.. కేంద్ర మంత్రిమండలి నుంచి తన రాజీనామాను సమర్పించినట్లు ఆయనవెల్లడించారు.

**నవీన్ పట్నాయక్‌పై తీవ్ర విమర్శలు..!**

అనంతరం రైరాఖోల్‌లో జరిగిన మరో సమావేశంలో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్.. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ (బీజేడీ) అధినేత నవీన్



పట్నాయక్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. తనను లక్ష్యంగా చేసుకుని బీజేడీ శ్రేణులు చేస్తున్న నిరసనలకు తాను ఏమాత్రం భయపడబోనని స్పష్టం చేశారు. విమానాశ్రయం వద్ద బీజేడీ యువజన, విద్యార్థి విభాగాల కార్యకర్తలు.. ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేయడంపై ఆయన ఘాటుగా స్పందించారు. "నేను ఒక సాధారణ రైతు బిడ్డను. మీరు నన్ను వెళ్లిపొమ్మని ఎంతగా అరిచినా నేను మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటాను" అని బదులిచ్చారు. యువతను తనపైకి ఉసిగొల్పుతున్నారని నవీన్ పట్నాయక్‌పై ప్రధాన్ మండిపడ్డారు. "నేను ఒడిశా ప్రజలకు ఒక మాయని మచ్చను, ఒక చెడ్డ వ్యక్తిని అని నవీన్ బాబు అంటున్నారు. నా వల్ల ఒడిశా ప్రజలకు ఎప్పుడైనా అవమానం జరిగిందా?" అని సభలో అడగ్గా.. లేదు అంటూ అక్కడి జనం నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్రానికి తాను పెద్దగా కీర్తి ప్రతిష్ఠలు తీసుకురాకపోయి ఉండొచ్చు కానీ.. తన పనుల వల్ల ఎన్నడూ రాష్ట్ర పరువు తీయలేదని ఆయన ఉద్ఘాటించారు. అలాగే సంబల్‌పూర్ ఇలవేల్పు అయిన సమలేశ్వరి దేవి, అలాగే పూరీ జగన్నాథుడి ఆశీస్సులతోనే తాను 12 ఏళ్ల క్రితం కేంద్ర మంత్రిని అయ్యానని ప్రధాన్ గుర్తు చేసుకున్నారు. అయితే ఈ సభా వేదికపై బీజేడీ ఎమ్మెల్యే, శాసనసభ ఉపనేత ప్రసన్న ఆచార్య కూడా ఉండటం గమనార్హం. బీజేడీ నిరసనల దృష్ట్యా తాను ఈ సభకు రావాలా వద్దా అని ప్రసన్నను అడిగానని.. కానీ ఆయన సాదరంగా ఆహ్వానించడంతోనే ఇక్కడికి వచ్చానని ప్రధాన్ చెప్పారు.

**లాఠీఛార్జి వల్లే చెడ్డపేరు: కౌంటర్ ఇచ్చిన బీజేడీ**

ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి రోహిత్ పూజారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రధాన్‌కు ఎవరూ ఉద్దేశపూర్వకంగా చెడ్డపేరు తీసుకురాలేదు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నీట్ విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం, దౌర్జన్యాల వల్లే ఆయనకు, ఆయన ప్రభుత్వానికి తీవ్ర అపఖ్యాతి వచ్చింది. ఇలాంటి సంఘటనల వల్లే ఆయన విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. పోలీసుల దౌర్జన్యాలకు నవీన్ పట్నాయక్‌ను నిందించడం అర్థరహితం" అని రోహిత్ పూజారి కౌంటర్ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ధర్మేంద్ర ప్రధాన్ పర్యటన నేపథ్యంలో బీజేడీ యువజన, విద్యార్థి విభాగాలు భారీ నిరసనలకు దిగే అవకాశం ఉందని ముందస్తు సమాచారం అందుకున్న సంబల్‌పూర్ పోలీసులు, ముందుజాగ్రత్త చర్యగా దాదాపు 30 మంది బీజేడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నార

# మీ పోరాటమే.. మా పోరాటం మీకోసం అసెంబ్లీలో కొట్లాడతాం

(మొదటి పేజీ తరువాయి)

ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు అండగా నిలబడుతూ, ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్స్ ఇవ్వడం రాష్ట్రానికే ఆదర్శమని అన్నారు. ఐదేళ్ల క్రితం ఫీజు కట్టలేక నా దగ్గరకు వచ్చిన హౌసింగ్ బోర్డుకు చెందిన రోహిత్ అనే అబ్బాయికి నేను సహాయం చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ అబ్బాయికి ఏడాదికి 6 లక్షల జీతం వస్తోందని పేర్కొన్నారు. తన తొలి ఏడాదంతా సంపాదించిన 6 లక్షల రూపాయలను తీసుకొచ్చి తిరిగి పేద విద్యార్థుల కోసం ఖర్చు చేయమని నాకే ఇచ్చాడని అన్నారు. కష్టపడి పైకొచ్చిన ఆ అబ్బాయి ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

శ్రీజ అనే దళిత విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు వస్తే ఫీజు కట్టలేని పరిస్థితిలో నా దగ్గరకు వచ్చింది. ఐదేళ్ల పాటు ఆమె ఫీజు నేనే కడతానని మాట ఇచ్చాను. గత ఏడాది ఫీజు కట్టానని.. ఈరోజు మీ అందరి సమక్షంలో ఆమె రెండో సంవత్సరం ఫీజును కూడా చెల్లిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించి, ఫీజు కట్టలేక ఇబ్బంది పడే దళిత బిడ్డలు ఎవరైనా నా దృష్టికి వస్తే వాళ్ళను డాక్టర్లను చేసే బాధ్యత నేను తీసుకుంటానని చెప్పారు. మంచి కార్యక్రమాలు చేస్తున్న న్యూస్ సొసైటీకి నా వంతు సహాయంగా ఈ సంవత్సరం కూడా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నానని తెలిపారు. కేసీఆర్ హయాంలో దళిత విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు పెంచామని తెలిపారు. సిద్దిపేటలో ఎస్సీ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ తెచ్చామన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, దళిత బంధు లాంటి అద్భుతమైన కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ కు బడ్జెట్ లో 5,403 కోట్లు కేటాయించి, ఖర్చు పెట్టింది కేవలం 74 కోట్లు మాత్రమే. ఆ 74 కోట్లు కూడా జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోయాయని అన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ ఒక్క నిరుపేద దళిత యువకుడికి గానీ, రైతుకు గానీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పైసా సహాయం అందలేదని చెప్పారు. దళితబంధు కింద 12 లక్షలు ఇస్తామని చెప్పి, బడ్జెట్ లో 2000 కోట్లు పెట్టి.. ఏ ఒక్కరికైనా ఒక్క రూపాయి సహాయం చేశారా? అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులు ల్యాప్స్ కావొద్దని, క్యారీ ఫార్వర్డ్ కావాలని మేము చట్టం తెస్తే.. ఈ ప్రభుత్వం 202425 లో 33 వేల కోట్లు ఎస్సీ నిధి కింద చూపి, ఖర్చు చేసింది కేవలం 14 వేల కోట్లే అని తెలిపారు. అందులో పెన్షన్లు అన్నీ కలిపి ఖర్చుగా చూపిస్తున్నారని అన్నారు. మాదిగ, మాల, ఏకలవ్య, సేవాలాల్, కొమురం భీమ్, బీసీ కార్పొరేషన్లు అని పేర్లు పెట్టి కాగితాలకే పరిమితం చేశారు తప్ప.. ఆ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం శోచనీయమని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు రోడ్డున పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో 19 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించి పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూశామని అన్నారు. ఇప్పుడు డిగ్రీలు, ఇంజనీరింగ్ పూర్తయినా కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, నిధుల కోసం అసెంబ్లీలో మేము కొట్లాడుతామని... విద్యావంతులైన మీరు కూడా ఈ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని గమనించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదవాలన్నారు

. వారి చదువుకు పేదరికం, కులం అడ్డుకాదని చెప్పారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. నాలుగైదేళ్లు క్రమశిక్షణతో కష్టపడితే మీ భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని తెలిపారు. మీరు గొప్ప ఆఫీసర్లుగా ఎదిగి మీ తల్లిదండ్రులు, మన సిద్ధిపేట గర్వపడేలా చేయాలని మనసారా దీవిస్తున్నానని అన్నారు.

# పోలీసులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు

**అనంతపురం, ఆగస్టు 9 (అనంత జనశక్తి న్యూస్):**

మెడికో ప్రియాంక కేసుకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో మద్యం మత్తులో యువకులు ప్రియాంకను కారుతో ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ప్రియాంక కేసుకు సంబంధించిన వివరాలను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదివారం రోజు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆగస్ట్ మూడో తేదీ ప్రియాంక, తన ఫ్రెండ్ కలిసి థియేటర్‌లో సినిమా చూసి తిరిగి వస్తున్నారు. ఈ సమయంలోనే మద్యం మత్తులో నిందితులు మాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా.. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. మద్యం తాగి ఉండటంతో మాల్‌లోకి ఎంట్రీకి అనుమతించలేదు.

దీంతో నిందితులు మాల్ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి పారిపోయే ప్రయత్నం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టుకునేందుకు యత్నించగా.. వేగంగా కారును నడిపి, స్కూటీపై వెళ్తున్న మెడికోలు ప్రియాంక, ఆమె స్నేహితుడిని కారుతో ఢీకొట్టారు. నిందితులు మూడుసార్లు కారుతో ఢీకొట్టగా.. ఈ ఘటనలో ప్రియాంకకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ప్రమాద ఘటనపై స్వతంత్ర ఆస్పత్రి నుంచి ఆగస్ట్ మూడో తేదీ రాత్రి పది గంటలకు పోలీసులకు సమాచారం అందింది. ఆరోజు రాత్రే పోలీసులు ప్రియాంక స్నేహితుడు నుంచి వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులు మూడుసార్లు స్కూటీని ఢీకొట్టి, ప్రియాంకను గాయపరిచి పారిపోయినట్లు గుర్తించామని ఎస్పీ వివరించారు. మరోవైపు ఘటన క్రూరంగా ఉండటంతో సెక్షన్లలో మార్పులు చేసి కేసు తీవ్రతను పెంచినట్లు ఎస్పీ వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. నిందితులు మద్యం మత్తులో కారు నడిపినట్లు ఆధారాలు సేకరించామని.. హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడించారు. నిందితులను కస్టడీకి అప్పగించాలని కోర్టులో పిటిషన్ వేస్తామని వివరించారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిడులు లేవని స్పష్టం చేశారు.

**రాజమండ్రిలో ఫిర్యాదు..**

మరోవైపు ప్రియాంక తండ్రి వెంకటేష్ ఈ ఘటనపై రాజమహేంద్రవరంలోని ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పోలీసులు ప్రస్తుతం పెట్టిన సెక్షన్లు తక్కువ తీవ్రతతో ఉన్నాయని.. కఠిన శిక్ష పడేలా సెక్షన్లు మార్చాలని వెంకటేష్ కోరారు.

# "రోజూ మధ్యాహ్నం అరగంట పడుకుంటా"

### - ఇంటర్వ్యూలో అభ్యర్థి కాన్ఫిడెన్స్‌కు ఫిదా అయి జాబ్ ఇచ్చేసిన సీఈఓ

జాబ్ ఇంటర్వ్యూలో జీతం, అలవెన్సుల కంటే ఎక్కువగా ప్రతిరోజూ మధ్యాహ్నం 30 నిమిషాల నిద్ర కావాలని అడిగిన ఒక 'జెన్ జీ' అభ్యర్థి డిమాండ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నోయిడాకు చెందిన కంపెనీ సీఈఓ నితిన్ వర్మను ఈ ప్రతిపాదన తొలుత ఆశ్చర్య పరిచినప్పటికీ.. పని చేసే గంటల కంటే నాణ్యమైన ఫలితాలే ముఖ్యమనే కోణంలో ఆలోచించి.. ఆ అభ్యర్థి చూపించిన నిజాయతీ, ఆత్మవిశ్వాసానికి ఫిదా అయిపోయినట్లు తెలిపారు. అందుకే అతడికి జాబ్ కూడా ఇచ్చినట్లు లింక్డ్ ఇన్ ద్వారా వెల్లడించారు.

సాధారణంగా ఉద్యోగ ఇంటర్వ్యూలు అనగానే అభ్యర్థులు తమ పని అనుభవం, సాధించిన విజయాలు, ఆశించే జీతం భత్యాల చుట్టూనే సంభాషణ నడుస్తుంటుంది. కానీ నోయిడాకు చెందిన ఒక కంపెనీలో జరిగిన జాబ్ ఇంటర్వ్యూ మాత్రం సరికొత్త మలుపు తిరిగింది. పని వేళల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం తనకు 30 నిమిషాల పాటు చిన్నపాటి నిద్ర కావాలని, అది తన పని సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని ఒక అభ్యర్థి బహిరంగంగానే షరతు విధించాడు. ఈ విచిత్రమైన కోరిక సదరు కంపెనీ ఫౌండర్‌ను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేంటని అడగ్గా.. సదరు అభ్యర్థి ఇచ్చిన సమాధానం విని.. వెంటనే జాబ్ ఇచ్చేశాడా సీఈఓ. ఆ పూర్తి వివరాలు మీకోసం.

"జీతం అడిగినట్లే.. ధైర్యంగా నిద్ర డిమాండ్"





Nitin Verma in • 3rd+
Founder & CEO @ InstaAstro (We are hiring), 3X Entrepreneur
View my newsletter
3d •

"Sir, I'll need a 30-minute nap every afternoon. It boosts my produc
A Gen Z candidate said this to me.

Not nervously. Not as a joke.
He said it like he was negotiating a salary.

My first reaction? The one every person my age would have.
In my time, asking for a nap in an interview would've ended it right

I almost smiled and moved on.
But then I actually thought about it.

Was he wrong?
I've read the same studies he probably has. A short afternoon nap
sharpen focus, memory, and energy.

Half the corporate world runs on people quietly dozing off in 3 PM
He was just honest enough to ask for it out loud.

So here's where I landed, and it's somewhere in the middle.
I respect the honesty. Most people hide who they are in interviews.
He told me exactly how he works best. That takes guts.

But I also said this to him.
"I don't care when you nap. I care whether the work gets done.
Deliver, and I'll never count your hours.
Don't, and no nap in the world will save you."

Because that's the real shift Gen Z is pushing, and honestly,
they're not entirely wrong.

నోయిడాకు చెందిన సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ నితిన్ వర్మ ఈ వినూత్న అనుభవాన్ని సామాజిక మాధ్యమం లింక్డ్ఇన్ ద్వారా నెటిజెన్లతో పంచుకున్నారు. ఇంటర్వ్యూకు హాజరైన 'జెన్ జీ' తరం అభ్యర్థి ఎలాంటి సంకోచం లేకుండా "సార్.. నాకు ప్రతిరోజూ మధ్యాహ్నం 30 నిమిషాల నిద్ర అవసరం. ఇది నా ప్రొడక్టివిటీని గణనీయంగా పెంచుతుంది" అని నితిన్ వర్మకు స్పష్టం చేశాడు. సదరు అభ్యర్థి ఈ విషయాన్ని ఏదో భయపడుతూనో లేదా సరదాగా జోక్ చేస్తూనో చెప్పలేదని.. సాధారణంగా జీతం విషయమై బేరసారాలు ఆడేటంత ఆత్మవిశ్వాసంతో స్పష్టంగా అడిగాడని వర్మ గుర్తు చేసుకున్నారు.

https://www.linkedin.com/feed/update/urn:li:activity:7490653497088966656/తొలుత తిరస్కరించాలనుకున్నా.. కానీ?

అభ్యర్థి నోటి నుంచి ఆ మాట వినగానే మొదటి క్షణంలోనే ఇంటర్వ్యూను ముగించేయాలని తనకు అనిపించిందని వర్మ వివరించారు. కానీ ఆ వెంటనే ఒక చిన్న చిరునవ్వు నవ్వి సంభాషణను ముందుకు తీసుకెళ్లానని పేర్కొన్నారు. చాలామంది ఇంటర్వ్యూల్లో తమ అసలు స్వభావాన్ని దాచిపెట్టి మాట్లాడతారని, కానీ ఈ అభ్యర్థి తను ఎలా సమర్థవంతంగా పనిచేయగలడో సూటిగా చెప్పాడని వర్మ గుర్తు చేసుకున్నారు. అంత నిజాయతీగా అడగడానికి ఎంతో తెగువ కావాలన్నారు. మధ్యాహ్న సమయంలో కొద్దిపాటి నిద్ర ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుందని చెబుతున్న అధ్యయనాలను గుర్తు తెచ్చుకున్నట్లు వెల్లడించారు. అలాగే ఆఫీసుల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశాల్లో చాలామంది రహస్యంగా నిద్రమత్తులో తూగుతుంటారని.. కానీ ఈ అభ్యర్థి దాన్ని బహిరంగంగా అడిగడం తనకు నచ్చిందని చెప్పుకొచ్చారు.

"పని ముఖ్యం కానీ.. గంటలు కాదు"

ఖచ్చితమైన నిద్ర సమయాన్ని కేటాయిస్తానని హామీ ఇవ్వడానికి బదులుగా సదరు అభ్యర్థికి వర్మ స్పష్టమైన షరతు విధించినట్లు తెలిపారు. "నువ్వు ఎప్పుడు నిద్రపోతావనేది నాకు అనవసరం. ఇచ్చిన పని పూర్తవుతుందా లేదా అనేదే నాకు ముఖ్యం. సరైన ఫలితాలు ఇస్తే నీ ఆఫీసు వేళలను నేను లెక్కించను. ఒకవేళ పని సరిగ్గా చేయకపోతే ప్రపంచంలో ఏ నిద్ర కూడా నిన్ను కాపాడలేదు" అని తేల్చి చెప్పినట్లు స్పష్టం చేశారు. అందుకు అతడు కూడా ఒప్పుకోగా.. అభ్యర్థికి తాను జాబ్ ఇచ్చినట్లు వర్మ చెప్పారు. ఇక్కడ 30 నిమిషాల నిద్ర అనేది ప్రధానాంశం కాదని.. తన అవసరాన్ని నిర్భయంగా అడిగిన ఆత్మవిశ్వాసం, దానికి తగ్గట్టుగా ఫలితాలను అందించగల సామర్థ్యమే ఆ అభ్యర్థికి ఉద్యోగాన్ని తెచ్చిపెట్టాయని ముగించారు.

ఉద్యోగ పని సమయాల్లో చిన్నపాటి నిద్ర అవసరం నిజంగానే ఉంటుందా? ఈ అంశంపై మీ అభిప్రాయాలను కామెంట్ బాక్స్‌లో పంచుకోండి.

## ఉద్యోగం పేరిట ఉచ్చు.. పోర్చుగల్ వ్యక్తికి భారత మహిళను అమ్మిన జాబ్ కన్సల్టెన్సీ



ఓ జాబ్ కన్సల్టెన్సీ మహిళను ఉద్యోగం పేరిట మోసం చేసింది. పోర్చుగల్ లోని బీర్ దుకాణం యజమానికి అమ్మేసి వేధింపులకు గురిచేసింది. అంతేకాకుండా ఆమె నుంచి భారీగా నగదు కాజేసింది. ఈ ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. బాధితురాలు పుణె క్రైమ్ బ్రాంచ్ పోలీసులను ఆశ్రయించడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పుర్‌కు చెందిన 28 ఏళ్ల మహిళ ఉద్యోగం కోసం పుణెకు చెందిన ఓ జాబ్ కన్సల్టెన్సీని ఆశ్రయించింది.వారు పోర్చుగల్, స్పెయిన్ వంటి దేశాల్లో క్యాషియర్, అకౌంటెంట్స్ ఉద్యోగాలు ఉన్నాయని, నెలకు రూ.1.5 లక్షల జీతం ఉంటుందని నమ్మబలికారు. వీసా ప్రాసెసింగ్, ఇతర ఖర్చుల పేరిట రూ.11 లక్షల ఖర్చు అవుతుందని, మూడు నెలల తర్వాత తన భర్తను కూడా విదేశాలకు తీసుకెళ్లొచ్చని మాయమాటలు చెప్పారు. వారి మాటలు నమ్మి ఆ మహిళ రూ.8 లక్షలను నిందితులకు చెల్లించింది. ఆ తర్వాత మాడ్రిడ్ నుంచి ఆమెను రోడ్డు మార్గంలో మే నెలలో పోర్చుగల్‌కు తరలించారు. పోర్చుగల్ చేరుకున్నాక ఆ మహిళ నుంచి నిందితులు పాస్‌పోర్ట్ లాక్కొని బీర్ దుకాణంలో పని కల్పించారు. ఆ దుకాణం యజమానికి తనను అమ్మినట్లు మహిళ గ్రహించింది. అక్కడ వెట్టిచాకిరి చేయడంతో పాటు మానసిక వేధనకు గురయ్యింది. ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకొని మాడ్రిడ్ చేరుకొని అక్కడనుంచి భారత్ చేరుకుంది. మరో చోట ఉద్యోగం కల్పిస్తామని, రూ.3 లక్షలు చెల్లించాలంటూ ఆ మహిళను నిందితులు మళ్లీ వేధించారు. అనంతరం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదుచేసింది. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## చనిపోయాడని గంగలో వదిలేయగా.. 8 ఏళ్లకు తిరిగొచ్చిన కుమారుడు

**అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు పాము కాటుకు బలి కాగా.. తలరాత ఇంతే అని గంగానదిలో వదిలేసిన ఆ నిరుపేద తల్లిదండ్రులు 8 ఏళ్ల తర్వాత ఇంటికి తిరిగొచ్చిన కుమారుణ్ని చూసి ఇంకా తేరుకోలేకపోతున్నారు. బిహార్‌లోని బెగూసరాయ్ జిల్లా మానోపుర్ ముషహరి గ్రామానికి చెందిన కవిత, రామ్‌ప్రీత్ దాస్ దంపతుల కుమారుడు రాహుల్. 12 ఏళ్ల వయసులో కాలకృత్యాలు తీర్చుకుందామని నది వద్దకు వెళ్లిన రాహుల్ పాముకాటుకు గురయ్యాడు. వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో కుమారుడు చనిపోయాడని కుమిలిపోయిన ఆ తల్లిదండ్రులు అయోధ్య ఘాట్ వద్ద గంగానదిలో వదిలేశారు. ఇది జరిగిన సరిగ్గా 8 ఏళ్ల తర్వాత రాహుల్ స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. తల్లితోపాటు అందరినీ పేరు పేరునా ఆప్యాయంగా పలకరించాడు. రాహుల్ శరీరంపై ఉన్న గాయాన్ని చూసి తల్లిదండ్రులు గుర్తించారు. నదీ ప్రవాహంలో కొట్టుకుపోతున్న తనను ఓ సాధువు కాపాడి, ఆధ్యాత్మిక విద్య సాధనకు గోరఖ్‌పుర్ తీసుకువెళ్లాడని రాహుల్ తెలిపాడు.**



## పిల్లల భవిష్యత్తు కంటే మంత్రి పదవి ముఖ్యమేం కాదు: ధర్మేంద్ర ప్రధాన్



**నీట్ పేపర్ లీక్‌వ్యవహారంపై జరిగిన ఆందోళనల్లో "జెన్ జీ"ని కొందరు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఓ యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో ఆయన తొలిసారి తన రాజీనామాపై స్పందించారు. ప్రధాన్ మాట్లాడుతూ.. "జెన్ జీ మన పిల్లలే. వారి అభివృద్ధి దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. వారితో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. గత పదేళ్లలో 20 కోట్ల మంది పిల్లలు జన్మించారు. వారు భారత్‌ను "విశ్వగురు"గా నిలబెడతారు. వారికంటే మంత్రి పదవి నాకు ముఖ్యమైనది కాదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి నేనే రాజీనామా చేసేందుకు ముందుకొచ్చాను" అని చెప్పారు. తనపై బీజేడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళనలకు భయపడేది లేదని ప్రధాన్ అన్నారు. భువనేశ్వర్ విమానాశ్రయం చేరుకున్న సమయంలో "ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్" అంటూ నినాదాలు చేశారని.. అయినా తాను మళ్లీ వస్తానని చెప్పారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని గుర్తుచేశారు. బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ తనను రాష్ట్ర ప్రజల దృష్టిలో అవమానకరంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. అయితే తాను ఒడిశా ప్రజలకు ఎప్పుడూ తలవంపులు తెచ్చే పని చేయలేదన్నారు.**

## మమతా బెనర్జీ కారుపై దాడి!





పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా.. దీదీ కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు.

బిర్జూ అనే టీఎంసీ కార్యకర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే ఆయన మృతి చెందారు. తన భర్తను లాకప్‌లో కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జూ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, డోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం కాస్త అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

''నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. నేను ఇక్కడే చనిపోయి ఉండేదాన్ని. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ.. ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది'' అని ఆమె ఆరోపించారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే మమత అక్కడికి వెళ్లారని భాజపా ఆరోపించింది. ఆమె రాకపై స్థానికులు నిరసన తెలిపారని పేర్కొంది.

## స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర లేని భాజపా, ఆరెస్సెస్ నోట నీతులు: ఖర్గే



దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాజపా, ఆరెస్సెస్ ఎలాంటి పాత్ర పోషించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీయేనని, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ పార్టీ నిరంతరం కృషి చేసిందన్నారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'దేశ స్వాతంత్ర్యం కోసం ఆరెస్సెస్, భాజపా నేతలు ఎవరైనా జైలుకు వెళ్లారా.. ఒకవేళ ఎవరైనా వెళ్లినా వారు తొలుత కాంగ్రెస్‌లో ఉండి.. ఆ తర్వాత అటువైపు వెళ్లినవారై ఉంటారు' అని వ్యాఖ్యానించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యం లేకపోయినా భాజపా నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తిపై పాఠాలు, నీతులు చెబుతుంటారని ఎద్దేవా చేశారు.

## భారత్ పర్యటనలో ట్రంప్ అల్లుడు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్నల్లుడు మైఖేల్ బౌలోస్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఆయన వ్యక్తిగత పర్యటన కోసం శనివారం కేరళలోని కొచ్చిన్‌కి చేరుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ట్రంప్ కుమార్తె టిఫనీ ట్రంప్‌నకు భర్త అయిన బౌలోస్‌వెంట భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కేరళ ముఖ్యమంత్రి వి.డి.సతీశన్.. బౌలోస్‌తో చర్చలు జరిపారంటూ.. పలు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ వార్తలను ముఖ్యమంత్రి కార్యాలయం తోసిపుచ్చింది. అమెరికా రాయబారితోనే అధికారికంగా చర్చించినట్లు స్పష్టం చేసింది.

## ట్రైబ్యునళ్ల నియామకాలకు జాతీయ కమిషన్ లోక్‌సభ ముందుకు రానున్న బిల్లు



వివిధ ట్రైబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు, సభ్యుల నియామకాలకు ప్రత్యేకంగా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ మేరకు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ట్రైబ్యునళ్ల సారథులు, సభ్యుల అర్హతలు, నియామక ప్రక్రియలో సమర్థత, పారదర్శకతను పెంచి ఏకరూపతను సాధించాలని సుప్రీం కోర్టు గతంలో ఆదేశించింది. ఈ మేరకు 'ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లు'ను సిద్ధం చేశారు. 'నేషనల్ ట్రైబ్యునల్ కమిషన్' ఏర్పాటుకు విధివిధానాలను దీనిలో పొందుపరిచారు. ఒక ఛైర్‌పర్సన్, నలుగురు సభ్యులతో ఇది ఏర్పాటవుతుంది. వీరిలో ఇద్దరు న్యాయ రంగం నుంచి, ఇద్దరు సాంకేతిక రంగం నుంచి ఉంటారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తినిగానీ. హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తినిగానీ కమిషన్ సారథిగా నియమిస్తారు.

## మోదీతో ఫోన్లో మాట్లాడిన వాన్స్



అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్లో మాట్లాడారు. పరస్పర రక్షణ ఒప్పందంపై తుర్కియే, సౌదీ అరేబియా, పాకిస్థాన్‌లు ఇటీవల సంతకం చేసిన తరుణంలో వాన్స్ నుంచి మోదీకి ఫోన్‌కాల్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కీలక రంగాల్లో భారత్‌అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించుకునే అవకాశాలపై ఇరువురు చర్చించుకున్నారు. ఇటీవలే నాలుగో బిడ్డకు జన్మనిచ్చిన సందర్భంగా వాన్స్, ఉష దంపతులను మోదీ అభినందించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాని వెల్లడించారు. వీరి సంభాషణపై అమెరికా ఎలాంటి వివరాలు ప్రకటించలేదు.

## బురదలో కూరుకుపోయిన వాహనం.. ఆసుపత్రికి తరలిస్తున్న బాలిక మృతి

**పచ్చని అందాలతో పర్యాటకులను అలరించే కొండ ప్రాంతాల్లో ప్రకృతి పెట్టే పరీక్షల తాలూకు విషాదాలూ ఉంటాయి. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షా లకు కొండచరియలు విరిగిపడి రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. మారుమూల గ్రామం మిథ్యాణీకి చెందిన ఓ బాలిక (17) తీవ్రంగా జబ్బుపడటంతో శుక్రవారం ఆమెను రాజౌరీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించబోయారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం మార్గమధ్యంలో బురదలో కూరుకుపోయింది. స్థానిక వాలంటీర్లు శ్రమించడంతో 3 గంటల తర్వాత వాహనం కదిలింది. ఆసుపత్రికి చేరేలోపే బాలిక మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.**



# జనాభాలో మార్పులు... అనవసర భయాలు!

భారత్‌లో తగ్గుతున్న జననాల రేటు, పెరుగుతున్న వృద్ధుల సంఖ్య దేశప్రగతి పంథాను దెబ్బతీస్తాయనేది విశ్లేషకుల ఆందోళన! రాబోయే రోజుల్లో శ్రామిక కొరత పరిశ్రమలను కుదేలు చేస్తుందని, ఉత్పాదకత లేని వృద్ధుల సంరక్షణ భారం యువత సంపాదనను హరించి వేస్తుందనేది వారి అనుమానం. అయితే, వృద్ధజనం పెరిగినంత మాత్రాన పురోగతికి ఆటంకం కాదని, అది అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందనే వాదనలూ ఉన్నాయి.

భారతదేశం, మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు వృద్ధాప్యం వైపు అడుగులు వేస్తున్నాయి. ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ-ఓఈసీడీ గణాంకాల ప్రకారం 2025 నాటికి భారత్‌లో 65 ఏళ్లు పైబడిన వారు 7.4శాతం మంది ఉన్నారు. అమెరికా, బ్రిటన్‌లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. అక్కడ వృద్ధుల సంఖ్య దాదాపు 20 శాతానికి దగ్గరగా ఉంది. అయితే 1970 నాటి పరిస్థితితో పోలిస్తే భారత్‌లో వృద్ధుల జనాభా రెండింతలు పెరిగింది. 2050 కల్లా 15 శాతానికి చేరుతుందని భావిస్తున్నారు. భారతదేశ ఓఏడీఆర్ (100 మంది శ్రామిక శక్తికి 65 ఏళ్లు పైబడినవారు ఎంతమంది ఉన్నారనేది) 2000లో 8.9 ఉండగా, ఇప్పుడు 12.3 శాతానికి చేరింది. ఓఈసీడీ అంచనాల ప్రకారం ఇది 2050 నాటికి 24 శాతానికి, 2070 నాటికి ఏకంగా 42 శాతానికి చేరనుంది.

**జీవన ప్రమాణాల పెరుగుదలతో...**

దేశంలో పునరుత్పత్తి రేటు తొలిసారిగా జనాభా స్థిరత్వ స్థాయికంటే దిగువకు పడిపోవడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ప్రస్తుతం ఒక మహిళకు సగటున 1.9 పిల్లలు ఉన్నారు. జనాభా క్షీణించకుండా ఉండేందుకు అవసరమైన 2.1శాతంకంటే తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో ఇది మరీ దారుణంగా 1.4 శాతానికి పడిపోయింది. తెలంగాణలోనూ 1.5 శాతంగానే ఉంది. దీంతో గతంలోని అధిక జనాభా భయాలు ఇప్పుడు జనాభా క్షీణత ఆందోళనలుగా మారుతున్నాయి. అయితే, ఈ పరిణామాన్ని మనందరం స్వాగతించాలి. సంపన్నంగా మారే ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థలోనూ వృద్ధుల సంఖ్య పెరగడం సహజం. జీవన ప్రమాణాలు పెరిగేకొద్దీ, మెరుగైన వైద్య సదుపాయాలు ఆయుర్దాయాన్ని పెంచుతాయి. ఇవి ఉత్పాదక సంవత్సరాలను జోడిస్తాయి. 1970లో భారతీయుల సగటు జీవన కాలం మహిళలకు 48 ఏళ్లు కాగా, పురుషులకు 49 ఏళ్లు. 2000 నాటికి అది మహిళల్లో 64 ఏళ్లకు, పురుషుల్లో 62 సంవత్సరాలకు చేరుకుంది. ఇప్పడది మహిళలకు 74, పురుషులకు 71 సంవత్సరాలుగా ఉండటం అద్భుతమైన విషయమే.

మరోవైపు, మెరుగైన జనాభా గణాంకాలు ఉన్నాయని చెప్పుకొనే ఆఫ్రికా దేశాలు పేదరికం, తక్కువ ఆయుర్దాయం, అధిక శిశు మరణాలతో బాధపడుతున్నాయి. అక్కడి ఆర్థిక వ్యవస్థలు, క్యాపిటల్ మార్కెట్‌లు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాయి. అమెరికా, యూరప్ దేశాల జనాభా తీరుతెన్నుల పట్ల కూడా మార్కెట్ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటలీ లాంటి దేశాల మందగమన వృద్ధికి జనాభా మార్పులే కారణమని వారు పేర్కొంటారు. కానీ పని గంటల సంఖ్య, పెట్టుబడుల ప్రవాహం, వివిధ రంగాల భాగస్వామ్యం, కీలక రంగాల కూర్పులాంటి నిజమైన ఆర్థిక చోదకాలను విస్మరిస్తారు. గత ఇరవై ఏళ్లలో అద్భుతమైన స్టాక్ మార్కెట్ లాభాలను సాధించిన స్వీడన్, జర్మనీ, హాలండ్ లాంటి దేశాల్లో వృద్ధుల నిష్పత్తి ఆకాశాన్ని తాకుతున్న నిజాన్ని దాటవేస్తారు. ఇప్పుడు ఈయూలో వేగంగా దూసుకుపోతున్న స్పెయిన్, ఇదే జనాభా నిష్పత్తి వల్ల నష్టపోతుందన్న విమర్శలను గతంలో ఎదుర్కొందన్న సత్యాన్ని విస్మరిస్తున్నారు.

**అనుభవమే పెద్ద సంపద**

భారతదేశ వృద్ధ జనాభా గురించి భయపడేవారు, 1950లో ఓఏడీఆర్ గణాంకాలు మొదలైనప్పడు అమెరికాలో అది 14.1 శాతంగా ఉందనే విషయాన్ని మర్చిపోతున్నారు. ఇప్పటి ఇండియా నిష్పత్తికంటే అది ఎక్కువ. అమెరికాలో ఆర్థిక వృద్ధి కుంటుపడకపోగా, ఆ తరవాతి 76 ఏళ్లలో ఆ దేశం కళ్లు చెదిరే ఆర్థిక ప్రగతిని, సరికొత్త ఆవిష్కరణలను, అపార సంపదను సృష్టించింది. ఈ తరహా ప్రతికూల ఆలోచనలకు కొంతవరకు పాతకాలపు ఆలోచనాతీరే కారణం. వృద్ధులందరినీ కేవలం పింఛన్లు తీసుకుంటూ, తిని కూర్చునే వారిగా విమర్శకులు చిత్రీకరిస్తున్నారు. ఇది పూర్తిగా తప్పు. వయసైనవారు కూడా మార్కెట్లో ఖర్చు పెడుతూనే ఉంటారు. పెట్టుబడులు పెడుతూ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి అవసరమైన మూలధనాన్ని అందిస్తారు. ఈ రోజుల్లో చాలామంది 70-80 ఏళ్ల వయసులోనూ పనిచేస్తున్నారు. నేటి ఆధునిక సేవ, సాంకేతిక ఆధారిత ఆర్థిక వ్యవస్థల్లో, ముఖ్యంగా ఇండియాలాంటి దేశాల్లో వృద్ధుల అనుభవం వారి ఉత్పాదకతను మరింతగా మెరుగుపరుస్తుంది.

భారత్‌లో జననాల రేటు మున్ముందు కూడా క్షీణిస్తూనే ఉంటుందని ఎవరూ నిక్కచ్చిగా చెప్పలేరు. యూరప్‌లో జనన రేట్లు పడిపోతున్నాయనే ఆందోళనల మధ్యే, ఈ శతాబ్దంలో అక్కడ జనాభా వృద్ధిరేటు పలుమార్లు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో మూడో నాల్గో బిడ్డను కనేవారికి ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలు సహాయ పడబోవనీ, తెలంగాణ కూడా రెండేళ్ల క్రితం 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేయడం వల్ల కలిగిన ప్రయోజనం పెద్దగా లేదని విమర్శకులు అంటున్నారు. కానీ, జనాభా సరళి అనేది భవిష్యత్తును శాసించదు. ఆవిష్కరణలే దేశ భవితను మారుస్తాయి. మారుతున్న జనాభా తీరుతెన్నులపై భయపెట్టే విశ్లేషణలను చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధిక సంఖ్యలో భారతీయులు సుదీర్ఘ కాలం జీవించగలుగుతున్నారంటే, అది భారతదేశం సాధించిన ఆర్థిక విజయాలకు నిదర్శనంగా భావించాలి. వృద్ధుల సంఖ్య పెరుగుదల అనేది ముమ్మాటికీ భయపెట్టే అంశం కాదన్న సంగతిని గుర్తించాలి.





# వాతావరణ మార్పులతో సరికొత్త సవాళ్లు

**వాతావరణ మార్పులు సరికొత్త సవాళ్లను రువ్వుతున్నాయి. వీటి కారణంగా తలెత్తే తాగునీటి కష్టాలు, సాగు నష్టాలు, వలసలు, తీరప్రాంతాల మునక వంటివి పలుదేశాలకు సంక్షోభాలుగా పరిణమించే ప్రమాదం పొంచి ఉంది. భద్రతాపరమైన అంశాలకన్నా జన జీవన ప్రమాణాలు, నీటిలభ్యత, ఆహారభద్రత, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలే రాబోయే కాలంలో దేశాల సుస్థిరతను నిర్ణయించే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాతావరణ మార్పుల సమస్య ఇప్పుడు దక్షిణాసియాలో జడలు విప్పతోంది. హిమాలయ పర్వతాల్లో మంచు శరవేగంగా కరిగిపోతోంది. గంగ, సింధు, బ్రహ్మపుత్ర లాంటి నదుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోంది. మరోవైపు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాల్లో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వరదలు, కరవులు, తుపాన్లు, సముద్రమట్టాలు పెరగడం లాంటి పరిణామాల వల్ల కోట్లమంది ప్రజల జీవనాధారాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటిదాకా పర్యావరణ సమస్యగానే కనిపిస్తున్నప్పటికీ, ఇది భద్రతా సమస్యగానూ మారుతోంది. ఎందుకంటే, తీవ్ర కరవుకాటకాల బారిన పడుతున్న దేశాల నుంచి ఎంతోకొంత మెరుగైన దేశాల్లోకి వలసలు ఉధృతంగా ఉంటున్నాయి. ఈ శరణార్థుల సమస్య భారత్ లాంటి దేశాలకూ ఎక్కువగానే ఉంటోంది.**

**దేశాల మధ్య వివాదాలు**

సముద్రమట్టం పెరుగుదల ఇప్పటికే మాల్దీవులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆ దేశ అస్తిత్వమే సంక్షోభంలో పడు తోంది. మనదేశంలో తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లోని తీరాలూ తరచూ వరదల బారిన పడు తున్నాయి. పాకిస్థాన్‌లో ఒకవైపు వరదలు, మరోవైపు కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. అఫ్గానిస్థాన్‌లో నీటి కొరత వల్ల రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. దక్షిణాసియాలో వాతావరణ మార్పుల ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తున్న రంగం నీటి వనరులే. భారత్, పాక్‌ల మధ్య యుద్ధాలు జరిగినా సింధునదీ జలాల ఒప్పందం చాలాకాలం అమలైంది. పహల్గాం ఘటన తర్వాత సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టకపోతే సహకారం సాధ్యం కాదంటూ భారతదేశం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఆ ఒప్పందం కుదిరిన సమయంలో హిమాలయాల్లోని హిమానీనదాల కరుగుదల ప్రస్తుతం ఉన్నంత స్థాయిలో లేదు. ఇప్పుడు హిమాలయ ప్రాంతమంతా వేగంగా మారిపోతోంది. ఆసియా మొత్తానికి నీటినిల్వ కేంద్రంగా పరిగణించే ఈ ప్రాంతం సామర్థ్యం క్రమంగా తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో నీటి వివాదాలే పెద్ద సమస్యగా మారే అవకాశముంది. ప్రపంచంలో అత్యంత కలుషిత నగరాల జాబితాలో తరచూ దిల్లీ, లాహోర్ పేర్లు కనిపిస్తాయి. పంటవ్యర్థాల దహనం, పరిశ్రమల నుంచి వెలువడే ఉద్గారాలు, వాహనాల కాలుష్యం వంటివన్నీ కలిసి ప్రతిసారీ చలికాలంలో విషపూరితమైన పొగమంచును సృష్టిస్తున్నాయి. ఒక దేశంలో మొదలైన కాలుష్యం మరో దేశ ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపవచ్చు. సమస్య పెరిగితే ఆయా దేశాల మధ్య వివాదాలను రాజేసే అవకాశాలు లేకపోలేదు.

వాతావరణ సంక్షోభ భారం సమాజంలో ధనికులతో పోలిస్తే, పేదల మీదే ఎక్కువగా పడుతుంది. ప్రభుత్వం నుంచి తగినంతగా నీటిసరఫరా లేకపోయినా, కాలుష్యం పెరిగినా, ఆరోగ్య సమస్యలు ఎక్కువైనా ముందుగా నష్టపోయేది పేదలే. పేదల్లోనూ గర్భిణులు, చిన్నారులపై ఎక్కువగా ఉంటుంది. ఈ అసమానతలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తాయి. వనరులు తగ్గినప్పుడు వాటికోసం పోటీ పెరిగి, చివరికి రాజకీయ అస్థిరతకు కారణం అవుతుంది. వాతావరణ సంక్షోభానికి సాంకేతిక పరిష్కారాలు అంత సులభం కావు. ఉదాహరణకు హరిత విప్లవంతో దేశంలో ఆహారోత్పత్తి పెరిగినా, భూసార క్షీణత, భూగర్భ జలాల అధిక వినియోగం లాంటి సమస్యలు తలెత్తాయి. హరిత ఇంధనంతో కర్బన ఉద్గారాలు తగ్గుతాయంటున్నా, బ్యాటరీల కోసం లిథియం తవ్వకాలతో ఎంతోకొంత పర్యావరణ నష్టాన్ని ఎదుర్కోవాల్సిందే.

**పరిష్కార మార్గమేంటి?**

వాతావరణ మార్పుల సంక్షోభాన్ని అధిగమించేందుకు దేశాలు సహకరించుకోవాలి. ఉదాహరణకు పాకిస్థాన్‌లో తరచూ వరదలు, కరవు లాంటి పరిస్థితులు కనిపిస్తుంటాయి. అక్కడి వాతావరణ హెచ్చరికల వ్యవస్థ బలహీనంగా ఉంటోంది. పొరుగు దేశాలు వాతావరణ సమాచారాన్ని పంచుకోవడం ద్వారా తోడ్పాటు అందించవచ్చు. అది అన్నిపక్షాలకూ మేలు కలిగిస్తుంది. ఎందుకంటే, అక్కడ వచ్చే వరదల ప్రభావం సరిహద్దుల ఇవతల నష్టం కలిగించకుండా జాగ్రత్తపడవచ్చు. అదేవిధంగా అభివృద్ధి చెందిన దేశాలు తమ ఇరుగుపొరుగున ఉండే చిన్నదేశాలకు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం ద్వారా నష్టాలను కొంతవరకు అధిగమించవచ్చు. ప్రకృతిని మనం కాపాడినంతకాలం అది మనల్ని రక్షిస్తుంది. విచ్చలవిడిగా ప్రకృతిని చెరబడితే దుష్ప్రభావాల బారిన పడక తప్పదు. ఈ విషయంలో దేశాలకు అప్రమత్తత తప్పదు. అన్ని దేశాలూ పరస్పర సహకారంతో ముందడుగు వేయడం ద్వారా వాతావరణ మార్పుల ముప్పును సమష్టిగా ఎదుర్కోవాలి.

# పరీక్షల అవ్యవస్థ మారుతుందా?

**నీట్-యూజీ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దారుణావస్థకు కారణమైన వ్యవస్థాగత వైఫల్యాలపై విద్యార్థుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అవి తీవ్ర నిరసనల రూపం దాల్చి చివరికి కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. ఈ నేపథ్యంలో పోటీపరీక్షలను పటిష్ఠంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలేమిటో సూచించడానికి ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కొలువుతీర్చినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఈ టాస్క్‌ఫోర్స్- పరీక్షల విశ్వసనీయతను, వ్యవస్థలో పారదర్శకతను పెంచడంపై దృష్టిపెడుతుందని అంటున్నారు. కాలంచెల్లిన, లోపభూయిష్ఠమైన ఆఫ్‌లైన్ పరీక్షా విధానంవల్లే ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టలేకపోతున్నామని, ఆన్‌లైన్ పద్ధతికి మారితేనే సమస్య పరిష్కారమవుతుందని నిపుణులు స్పష్టీకరిస్తున్నారు. 'ఇస్రో' మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ సారథ్యంలో రెండేళ్ల కిందట ఏర్పాటైన కమిటీ కూడా ఈ కోణంలోనే విశేష సూచనలెన్నో చేసింది. వాటిని గమనంలోకి తీసుకుంటూ నవతరం భవితను సురక్షితం చేసే సిఫార్సుల క్రోడీకరణపై నీలేకని టాస్క్‌ఫోర్స్ దృష్టిసారించాలి. పార్లమెంటరీ స్థాయీసంఘం ఇటీవల ఉద్ఘాటించినట్లు, పోటీపరీక్షల నిర్వహణలో సంస్కరణల అమలుకు కాలపరిమితితో కూడిన నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించాలి!**



పరీక్షలనేవి విద్యార్థులు ఒంటపట్టించుకున్న జ్ఞానాన్ని, అభివృద్ధి చేసుకున్న నైపుణ్యాలను, సానపెట్టుకున్న వ్యక్తిత్వాలను పరిశీలించేవిగా ఉండాలి. భిన్న సామర్థ్యాలతో విభిన్న వేగాలతో ఉండే పిల్లల శక్తియుక్తులను సహేతుకంగా సమర్థంగా బేరీజు వేయాలి. కానీ, అందరినీ ఒకేగాటనకట్టేసి ఏడాదికోసారి పెట్టే పరీక్షల్లో వచ్చే మార్కులను బట్టి 'ప్రతిభావంతులను' ఎంపిక చేసే పద్ధతి అనారోగ్యకర పోటీని సృష్టిస్తోంది. పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ నేర్చుకోవడానికి బదులు ఐఐటీ, మెడికల్ సీట్లకోసం ఆరో తరగతి నుంచే ప్రశ్నలూ జవాబులను బట్టీపట్టాల్సిన దౌర్భాగ్యంలోకి విద్యార్థులను నెట్టేస్తోంది. కోచింగ్ కేంద్రాలకు వేలకువేలు ధారబోసి ప్రత్యేక శిక్షణ పొందితేనే కానీ కోరుకున్న ఉన్నత చదువుల్లోకి ప్రవేశించలేని దయనీయ స్థితిని కల్పిస్తోంది. జాతీయ విద్యావిధానం, యశ్‌పాల్ కమిటీ, కొఠారీ కమిషన్ వంటివి సిఫార్సు చేసినట్లుగా వార్షిక పరీక్షల భారాన్ని తగ్గించి నిరంతర సమగ్ర మూల్యాంకనంతో విద్యార్థుల ప్రతిభాపాటవాలను గణిస్తేనే దీర్ఘకాలంలో భారతావనికి మేలు జరుగుతుంది. దానికి బదులుగా జ్ఞాపకశక్తిని పరీక్షించే రొడ్డకొట్టుడు ఎగ్జాములకు కట్టుబడినంతకాలం విద్యార్థులకు కుంగుబాటు, వారి తల్లిదండ్రులకు కడుపుకోత తప్పవు!

ఉన్నత విద్యాలయాల్లో పరీక్షల వ్యవస్థను సాకల్యంగా ప్రక్షాళించడానికి ఏమి చేయాలో చెబుతూ ఆచార్య ఎంఎం సాలుంఖే కమిటీ ఏడేళ్ల కిందటే సవివర నివేదిక సమర్పించింది. అభ్యసన ఫలితాల ఆధారిత మూల్యాంకన పద్ధతిని స్వీకరించడం, అంతర్గత పరీక్షలకు ప్రాధాన్యమివ్వడం, ప్రతిదశలోనూ సునిశిత పర్యవేక్షణకు పట్టంకట్టడం తదితర విస్పష్ట సూచనలను ఆ సంఘం అందించింది. ఇలాంటి వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ విద్యార్థులను అంతులేని ఒత్తిడికి గురిచేస్తున్న పాత పద్ధతులకు వీడ్కోలు పలకడం సర్కారు బాధ్యత! వివిధ కోర్సుల్లో ప్రవేశాలకోసం, ప్రభుత్వోద్యోగాల నిమిత్తం ఏటా మూడుకోట్ల మందికి పైగా ఆయా పరీక్షలకు హాజరవుతుంటారని అంచనా. వాటిలో ఏమాత్రం అవకతవకలు చోటుచేసుకున్నా అన్ని కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అర్థంచేసుకుని పరీక్షల అవ్యవస్థను చక్కదిద్ది యువభారతానికి భరోసా కల్పించేందుకు సమష్టిగా పరిశ్రమించాలి!

# భస్మాసుర హస్తాలు... రోగ్ ఏఐ నమూనాలు!

**కృత్రిమ మేధ కొన్నిసార్లు కట్టుతప్పతోంది. గీత దాటుతున్న కొన్ని ఏఐ నమూనాలు భస్మాసుర హస్తాలుగా మారుతున్నాయి. ఇలాంటి దుష్ట (రోగ్) ఏఐ నమూనాల వల్ల ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఉదంతాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. భవిష్యత్తులో స్వార్థపరులు వీటిని సొమ్ము చేసుకోవచ్చన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్ సినిమాలు, నవలలకే పరిమితమైన అంశాలను ఇప్పుడు వాస్తవ ప్రపంచంలో చూస్తున్నాం. కృత్రిమ మేధ(ఏఐ) పుణ్యమా అని ఎన్నో అనూహ్య పరిణామాలు జరుగుతున్నాయి. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం స్వల్పకాలంలోనే శక్తిమంతంగా ఎదిగింది. దీనివల్ల ఎన్నో లాభాలు ఉన్నా కొన్నిసార్లు ప్రయోజనాలకు బదులు ఇబ్బందులు కొనితెస్తోంది. కంప్యూటర్ వ్యవస్థల్లో లోపాలను గుర్తించి, వాటిని అధిగమించడానికి సాయపడాల్సిన ఏఐ, కొన్ని సందర్భాల్లో ఎదురుతంతోంది. ఈ టెక్నాలజీ వల్ల డీప్‌ఫేక్‌లు, అధునాతన సైబర్ స్కామ్‌లు నిత్యకృత్యంగా మారాయి. లోపాలను గుర్తించి, సొమ్ము చేసుకోవడాన్ని ఏఐ మరింత వేగవంతం చేస్తోంది. ముఖ్యంగా కొన్ని అధునాతన నమూనాలు మరీ ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇలాంటి టెక్నాలజీలను నిర్మిస్తున్న తీరుకు నిరసనగా ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ వంటి అగ్రశ్రేణి టెక్ కంపెనీల్లో పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు తమ ఉద్యోగాలను వదిలేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.**




**ఇంతకీ ఏం జరిగింది?**

పెన్‌ఏఐ సంస్థ 'జీపీటీ5.6 సొల్'తోపాటు ఇంకా విడుదలకాని మరో ఏఐ మోడల్ సైబర్ భద్రత సామర్థ్యాలను పరీక్షిస్తోంది. ఇంటర్నెట్ అనుసంధానత లేని ఏకాంత వాతావరణం(శాండ్‌బాక్స్)లో ఈ పరీక్షలు సాగాయి. అయితే ఆ ఏఐ నమూనాలు కట్టుతప్పి శాండ్‌బాక్స్ నుంచి బయటికి వచ్చేశాయి. ఇంటర్నెట్‌లోకి చొరబడ్డాయి. 'హగ్గింగ్ ఫేస్' అనే టెక్ కంపెనీ సర్వర్లలో లోపాలను గుర్తించాయి. లాగిన్ వివరాలను తస్కరించి వాటిలోకి ప్రవేశించాయి. పరీక్షలో భాగంగా తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరే క్రమంలో ఏఐ నమూనాలు ఈ చర్యకు పాల్పడ్డాయి. ఒక సాధారణ లక్ష్యాన్ని నెరవేర్చడానికి అసాధారణ స్థాయిలో స్పందించాయి. 'ఆన్సర్ కీ'ని పొంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించే ప్రయత్నం చేశాయి. తద్వారా తమ పనితీరు అద్భుతంగా ఉందంటూ పరిశోధకులను మోసపుచ్చాలనుకున్నాయి. 'హగ్గింగ్ ఫేస్' అనేది ఏఐ పరిజ్ఞానానికి సంబంధించిన డిజిటల్ లైబ్రరీ. అందులో లక్షల ఏఐ మోడల్స్ ఉంటాయి. మదింపు పరీక్షలో ఎలా పాస్ కావాలన్న దానిపై అందులో కిటుకులు ఉండొచ్చని ఆ నమూనాలు భావించాయి. మరోవైపు, ఓపెన్‌ఏఐ వ్యాపార ప్రత్యర్థి ఆంత్రోపిక్‌కూ ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆ సంస్థకు చెందిన శక్తిమంతమైన 'క్లాడ్ మిథోస్ ప్రివ్యూ' నమూనా ఇబ్బందులకు గురిచేసింది. అది శాండ్‌బాక్స్ వెలుపలికి వచ్చేసి ఇంటర్నెట్‌తో అనుసంధానమైంది. తాను తప్పించుకున్నానని, తన చర్యలకు సంబంధించిన ఆధారాలను చెరిపేశానంటూ ఏకంగా ఒక పరిశోధకుడికి ఈమెయిల్ కూడా పంపింది. దీంతో ఏఐ నమూనా విడుదల నిర్ణయాన్ని ఆంత్రోపిక్ నాడు ఉపసంహరించుకుంది. ఈ ఏడాది మే నెలలో ఒక అంతర్గత ఓపెన్‌ఏఐ నమూనా తన శాండ్‌బాక్స్ నిబంధనలను ఏమార్చింది. సైబర్ భద్రత బెంచ్‌మార్క్ ఫలితాలను అంతర్గత కంపెనీ శ్లాక్ ఛానల్‌కు తెలియజేయాలని ఆదేశమివ్వగా అది కట్టుతప్పి గిట్‌హబ్‌కు ఆ వివరాలను పోస్ట్ చేసింది.

ఏఐ నమూనాలకు వివేచన లేదా స్వతంత్ర కోరికలు ఉండవు. అయితే ముందే ప్రోగ్రామ్ చేసిన లక్ష్యాలను ఛేదించే క్రమంలో అవి అనూహ్య, స్వతంత్ర వ్యవహారశైలిని ప్రదర్శించగలవు. అధునాతన ఏఐ వ్యవస్థలు ముఖ్యంగా స్వయంప్రతిపత్తితో కూడిన నమూనాలు డెవలపర్ పెట్టిన నియంత్రణలను అధిగమించగలవని రుజువు చేస్తున్నాయి. వారిని మోసగించడానికి వినూత్న మార్గాలను గుర్తించగలవు. ఏఐ నమూనాలు సొంతంగా నడుచుకుంటున్నాయంటే దానికి నిర్దిష్ట సాంకేతిక యంత్రాంగాలే కారణం. అంతేకానీ ఆ యంత్రానికి స్వీయ అవగాహన వచ్చినట్లు కాదు. సాధారణంగా, ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించేలా ఏఐ నమూనాలను తీర్చిదిద్దుతారు. ఆ లక్ష్యసాధన కోసం నిబంధనను అతిక్రమించడమే సమర్థ విధానమని భావించినప్పుడు అవి ఆ మార్గాన్ని అనుసరిస్తాయి. ఆ మార్గాన్ని సమర్థంగా మూసివేస్తే ఈ ఇబ్బంది ఉండదు. మార్కెట్లోకి తీసుకురావడానికి ముందు ఒక మోడల్ వాస్తవ సామర్థ్యాలను ఎలాంటి ఆంక్షలు లేని పరిస్థితుల మధ్య పరీక్షిస్తుంటారు. ఇందులో భాగంగా ఉద్దేశపూర్వకంగా రక్షణ ఏర్పాట్లను తొలగిస్తుంటారు. దీనివల్ల కూడా ఏఐ నమూనాలు కట్టుతప్పవచ్చు.

**మేల్కొంటే మేలు**

ఆధునిక ఏఐ స్థిర టెక్స్ట్ జనరేటర్ల స్థాయి నుంచి 'ఏజెంటిక్' వ్యవస్థలుగా రూపాంతరం చెందుతోంది. ఈ వ్యవస్థలకు వెబ్‌బ్రౌజర్లు, కోడ్ ఎగ్జిక్యూటర్లు, టెర్మినల్ యాక్సెస్ వంటి వ్యవస్థలతో సంధానత కల్పిస్తున్నారు. ఫలితంగా అవి మానవ ప్రమేయం లేకుండానే విస్తృత అంశాలపై సొంతంగా ప్రణాళికలు రచించడం, అమలు చేయడం వంటివి చేస్తున్నాయి. ఏఐ అంతర్గత లక్ష్యాలు మానవ ఉద్దేశాలు, నైతికతతో సరిగ్గా సరిపోయేలా ఉండాలి. అయితే ఒక ఏఐ నమూనాకు సంక్లిష్టమైన లేదా గందరగోళంతో కూడిన డేటాతో శిక్షణ ఇస్తే అది కొన్నిసార్లు దారితప్పుతుంది. తనకిచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికే ప్రాధాన్యం ఇస్తుంది. పాటించాల్సిన నిబంధనలకు నీళ్లు వదిలేస్తుంది. ఈ క్రమంలో ఏఐ వృద్ధిలో జోరు తగ్గించాలని, ఆ పరిజ్ఞానంతో మానవుల ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చంటూ నిపుణులు కొంతకాలంగా హెచ్చరికలు చేస్తున్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం ⁝ అనంతపురం ⁝ 10.08.2026 ⁝ 01

# ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి.

**- ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి.**



**ధర్మవరం ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఆర్డిఓ రామ భూపాల్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... రెవెన్యూ డివిజన్ పరిధిలోని ధర్మవరం, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి, చెన్నై కొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి (7 మండలాలు) ప్రజలు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా తెలుపుకోవచ్చునని తెలిపారు. సమస్యలు తెలుపుకునేవారు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, చిరునామాతో రావాలని తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని 7 మండలాల తాసిల్దారుల కార్యాలయములలో కూడా ప్రజలు తమ సమస్యలను అర్జీ ద్వారా తెలుపుకొనవచ్చునని తెలిపారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ పరిధిలోని అందరు అధికారులు తప్పక హాజరు కావాలని వారు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని రెవెన్యూ ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని వారు విజ్ఞప్తి చేశారు.

# గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**- సంకల్పంతో గిరిజనులు ఎదగాలి...**
**- ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.**
**- ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విద్యావంతులుగా చేయాలి...**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**
**- గిరిజన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...**
**- ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప**

**అనంతపురం, ఆగస్టు 9 :అనంత జనశక్తి న్యూస్**



గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, గిరిజనులు మంచి సంకల్పంతో అలాగే ఎదగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబం లోనితమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిరిజన భవన్ లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, రాష్ట్ర ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావత్ సోమ్లా నాయక్ పాల్గొన్నారు. అలాగే వివిధ గిరిజన సంక్షేమ, అభివృద్ధి సంఘాల ప్రతినిధులు, గిరిజన గురుకుల పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, పలువురు గిరిజన మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తొలుత ప్రపంచ ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ 1994 "సం" డిసెంబర్ 23న ఆదివాసుల హక్కుల పరిరక్షణ కొరకు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవంను ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీన నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి లోని మానవ హక్కుల మరియు రక్షణ సబ్ కమిషన్ తీర్మానించి ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాలలోని ఆదివాసుల మానవ హక్కుల పరిరక్షణ పర్యావరణం అభివృద్ధి విద్యా మరియు వైద్య రంగాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సహకారం అందించడమే అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ ముఖ్య ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అనేకసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న నేపథ్యంలో అర్హులందరూ వాటిని ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఎవరో వస్తారు, ఏదో చేస్తారని వేచిచూడకుండా ఒక సంకల్పంతో గిరిజనులు ఎదగాలని అన్నారు. తమ పిల్లలను మంచి విద్య బోధనలు నేర్పించి వారు ఉన్నత స్థాయికి వెళ్లడానికి దోహదపడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, ఆహారం, దుస్తులు తదితర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన గిరిజన సమాజం అర్జీలసమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అలాగే ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా బాల్యవివాహాల నిర్మూలనకు ప్రభుత్వానికి సహకరించాలని, క్షేత్రస్థాయిలో ఆయా గిరిజన ప్రాంతాల గ్రామాలలో ఉత్సవ వేడుకలు జరిగినప్పుడు గ్రామ దేవత సమక్షంలో బాల్య వివాహాలు జరిపించమని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞను పూనుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా గిరిజనలు అంటే ఒక ప్రత్యేక భావన ఉంటుందని, వారందరికీ కూడా ప్రత్యేకమైన కట్టుబాట్లు, ఆచారాలు, అలవాట్లు ఉంటాయని, ఇక్కడున్న వారందరికీ ఒక ప్రత్యేకత ఉంటుందని, మీరు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించిన మీతో పాటు మీ సాంప్రదాయాలను కట్టుబాట్లను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చదువుతున్న పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ఏడాదికి రూ.15000 మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, స్కిల్ డెవలప్మెంట్, ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అవసరాలను గుర్తించి గిరిజన ప్రజల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం 100 శాతం రాయితీతో మరియు 10 ఎకరాల్లోపు ఉన్న ఇతర రైతులకు 90% రాయితీతో ఏపీఎంఐపి ద్వారా సూక్ష్మ సేద్య పరికరాల మంజూరు చేస్తున్నదని చిన్న, సన్న కారు పెద్ద కారు రైతులకు 50 శాతం రాయితీతో స్ప్రింకర్లను అందిస్తున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు జరిగాయని అర్హులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం అమలవుతున్నదని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం, ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంపొందించుకొని లబ్ధి పొందాలని సూచించారు.

నిరుద్యోగులైన బి.ఈ.డి, టిటిసి చేసిన గిరిజన యువతి యువకులకు ఉచితంగా డీఎస్సీ 2024 కోచింగ్ ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. అటవీభూములు సాగులో ఉన్న గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు, గిరిజన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆదివాసులు అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రభుత్వ చట్టాల పైన గిరిజనులకు అవగాహన ఉండాలని ఆదివాసుల జీవన విధానం సమాజానికి ఆదర్శం కావాలని అలాగే సాంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలని తెలిపారు. ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి సంస్కృత పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వారి మాతృభాషలో సులభంగా అర్థమయ్యేలా బోధించి తద్వారా డ్రాపవుట్ రేట్ ను తగ్గించడం కోసం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుని అమలు చేస్తున్నదని తెలిపారు. జిల్లాలో కూడా గౌరవ జిల్లా కలెక్టర్ గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్నట్లు కొనియాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గిరిజన ప్రజల అనేక సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మన జిల్లా కలెక్టర్ వారి పనితీరు పట్ల అనేక సందర్భాల్లో ప్రశంసించారని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కలెక్టర్ కు గిరిజన ప్రజల తరపున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. గిరిజనులు విద్యాపరంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల జీవితాల్లో వెలుగు రేఖలు నింపడానికి ప్రోత్సహిస్తున్నదని, అర్హులకు ఉపకార వేతనాలు మంజూరు చేయడంతో పాటు రైతు భరోసా పథకం కింద గిరిజన రైతుల భూములకు ఏడాదికి పెట్టుబడి మంజూరు తద్వారా గిరిజన రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల వ్యక్తిగత ఆవాస స్థితిగతులను మెరుగుపరిచే దిశగా సంక్షేమ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**గిరిజన సమస్యలు పరిష్కరించాలని వినతి :.**

జిల్లాలోని గిరిజన తండాలు కాలనీలు , గురుకుల పాఠశాలలు, బాల బాలికల హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి ఖాళీలను భర్తీ చేయాలని, క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి ఆయా గ్రామాలలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సాంస్కృతిక గిరిజన నృత్యాలు అందరిని అలరించాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి, ప్రిన్సిపాల్ లు మసూద్ వలి, ప్రవీణ్ కుమార్, కేశవ నాయక్, జిల్లా డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే మునసయ్య మోహన్ మరియు గిరిజన సంఘాల నాయకులు పోలా మహేష్, సాకే వీరాంజనేయులు, మహేష్ నాయక్ బంజారా సంగ అధ్యక్షులు శివ శంకర్ నాయక్, అశ్వర్థ నాయక్, శ్రీమతి కావేటి ఉమా మహేశ్వరీ, సాకే ముసలయ్య, మల్లికార్జున నాయక్, ముత్యాలమ్మ, రవి కుమార్ నాయక్, పాల్యా రామాంజనేయులు నాయక్, రాజేష్ నాయక్, పామిడి రమేష్ నాయక్, సురేష్ నాయక్, సాకే గాయత్రి , తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం...



**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు 9 అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా స్థానిక గిరిజన భవన్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి వెంకటప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం వల్ల ప్రాణదానం కలుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడి నుండి 50 కేజీల బరువు ఉండి 12 శాతం హేమో గోబిన్ కలిగిన ఎవరైనా మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. రక్తదానం పట్ల ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని సూచించారు. రక్తదానం చేసే వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సుమారు రూ.3 లక్షల వరకు ప్రమాద ఇన్సూరెన్స్ సదుపాయం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తం అవసరం ఉన్నవారికి ఇలాంటి శిబిరాల ద్వారా రక్తం ను సేకరించి ఆస్పత్రులలో అవసరం ఉన్నవారికి ఇతర వైద్య చికిత్సలు పొందుతున్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా తత్పరతను పెంపొందించుకొని మానవతా దృకృథంతో రక్తదానం చేయడానికి రక్తదాతలు ముందుకు రావాలని, రక్తదానం చేసి రక్తదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం శిబిరంలో రక్తదానం చేసిన రక్త దాతలకు జిల్లా కలెక్టర్, ఎస్టీ కమిషన్ సభ్యులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ కోఆర్డినేటర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు భరత్, పి ఆర్ ఓ జీవన్ కుమార్ , వివిధ గిరిజన సంఘాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విడాకుల దంపతులు ఒకటయ్యారు...!!

**- విడాకులు తీసుకుని విడిపోయారు... పోలీసుల కౌన్సిలింగ్ లో ఒకటయ్యారు.**
**- డి.ఎస్.పి... బివి జగన్నాథరాజు.**

**ధర్మవరం ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అశ్విని , ఆమె భర్త శ్రీనివాసులు కుటుంబ విభేదాల కారణంగా గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించి విడాకులు తీసుకున్నారు. ధర్మవరం డీఎస్పీ బీవీ జగన్నాథరాజు స్వయంగా నాగారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించి, గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుంటున్న సమయంలో అశ్విని తన కుటుంబ సమస్యను డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. విషయాన్ని తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అశ్విని, శ్రీనివాసులతో పాటు ఇరు కుటుంబ సభ్యులను ధర్మవరం డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి, ఫ్యామిలీ కౌన్సెలింగ్ అధికారుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ సందర్భంగా ఇరువర్గాల సమస్యలను సానుకూలంగా విని, కుటుంబ బంధాల ప్రాధాన్యతను వివరించడంతో పాటు, పరస్పరం అర్థం చేసుకోవడం, సహనం, సఖ్యత ఒకరినొకరు గౌరవించుకోవడం ద్వారా కుటుంబ జీవితాన్ని సంతోషంగా కొనసాగించవచ్చని వారికి సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం శ్రీనివాసులు తన భార్య అశ్వినితో కలిసి సఖ్యతగా కుటుంబ జీవితాన్ని కొనసాగించేందుకు అంగీకరించగా, అశ్విని కూడా తన భర్తతో కలిసి జీవించేందుకు అంగీకరించారు. దీంతో ఇరువురి మధ్య ఉన్న విభేదాలు తొలగి, ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో దంపతులను తిరిగి ఒక్కటిచేశారు. కుటుంబ సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించి, కుటుంబాలను నిలబెట్టేందుకు శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని డీఎస్పీ తెలిపారు.



# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి



**- ఆగస్టు 10వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**
**- సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..**
**- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**
**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, ఆగస్టు 09 :అనంత జనశక్తి న్యూస్**

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**ఆగస్టు 10వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :**

ఆగస్టు 10వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి. ఓలకు సూచించడమైనది.

# ఖబడ్దార్... జగన్ రెడ్డి

**- 2025 మెగా డీఎస్సీపై అబండాలు వేయడం మానుకో**
**- టీచర్ల కష్టాన్ని, ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడొద్దు**
**- కొండారెడ్డి బురుజు ఎక్కిన వాళ్లకు తాడేపల్లి ప్యాలెస్ ఎక్కడం లెక్కే కాదు**
**- దమ్ముంటే అసెంబ్లీకి రా...**
**- మెగా డీఎస్సీపై రోజంతా చర్చిద్దాం**
**- నీకు ఎంతసేపైనా మైక్ ఇస్తాం**
**- మంత్రి సవిత సవాల్**

**అమరావతి ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్**

మెగా డీఎస్సీని పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పకడ్బందీగా నిర్వహించారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయనడం సరికాదు... రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు... ఖబడ్దార్... కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కిన వారికి నీ తాడేపల్లి ప్యాలెస్ ఎక్కడం ఒక లెక్క కాదు... నీకు దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీకి రా... మెగా డీఎస్సీపై రోజంతా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం...' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత సవాల్ విసిరారు. సీఎం చంద్రబాబునాయుడు 14కు పైగా డీఎస్సీలు నిర్వహించి, రెండు లక్షల వరకూ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారు. ఏనాడూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా డీఎస్సీలు నిర్వహించారన్నారు. అయిదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని అసమర్థుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక వీడియో ప్రకటన చేశారు. డీఎస్సీ అంటేనే జగన్‌కు మొదటి నుంచి విషం కక్కుతున్నారన్నారు. నోటిఫికేషన్ రాగానే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవాలని చూశారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి, మెగా డీఎస్సీని అవినీతికి, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతుంటే, వారందరినీ గొడ్డలి పార్టీ అవమానిస్తోందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా, పోయినా టీచర్లను అవమానించడమే పనిగా పెట్టుకోవడం మానుకోవాలని హితవు పలికారు. అయిదేళ్ల పాలనలో ఉపాధ్యాయులను అన్ని విధాలా జగన్ వేధించారని మంత్రి సవిత మండిపడ్డారు.

**అసెంబ్లీకి రా చర్చిద్దాం**

సీఎం చంద్రబాబునాయుడు 14 డీఎస్సీలు నిర్వహించారని, వాటి ద్వారా రెండు లక్షలకు పైగా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఏ డీఎస్సీలోనూ అక్రమాలకు తావులేకుండా, టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. 2025 మెగా డీస్సీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని జగన్ కు హితవు పలికారు. డీఎస్సీ నిర్వహణపై ఎలాంటి అనుమానాలు ఉన్నా.. దమ్ము, ధైర్యం ఉంటే జగన్ అసెంబ్లీకి చర్చకు రావాలని అన్నారు.. జగన్‌కు ఎంతసేపైనా మైక్ ఇచ్చి గౌరవంగా మాట్లాడిస్తామని, అవసరమైతే ఒక రోజంతా మెగా డీఎస్సీపై అసెంబ్లీ వేదికగా చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. నీతి, నిజాయితీ, దమ్ము, ధైర్యం ఉంటే సభకు వచ్చి తేల్చుకోవాలని జగన్‌కు మంత్రి సవిత సవాల్ చేశారు.

**తాడేపల్లి ప్యాలెస్ ఎక్కడ లెక్కే కాదు**

టీచర్ ఉద్యోగాల కోసం రేయింబవళ్లు కష్టపడిన ఉపాధ్యాయుల కష్టాన్ని తక్కువ చేసి మాట్లాడడం సరికాదని మంత్రి సవిత హితవు పలికారు. వైసీపీ, జగన్ తప్పుడు ఆరోపణలపై రాయలసీమకు చెందిన ఉపాధ్యాయులంతా సమరశంఖం పూరించారన్నారు. ఖబడ్దార్ జగన్ రెడ్డీ... వారిని ఇలాగే అవమానిస్తే తీవ్ర పర్యావసనాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కిన వాళ్లకు తాడేపల్లి ప్యాలెస్ కు ఎక్కడం ఒక లెక్కే కాదని మంత్రి సవిత హెచ్చరించారు.



# ఆషాఢ మాస ఉత్సవాలలో భాగంగా అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించిన మంత్రి కందుల దుర్గేష్





- పందలపర్రు, తిమ్మరాజుపాలెం క్షేత్రాలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- రాష్ట్ర ప్రజల సంతోషం, సమగ్ర అభివృద్ధే ధ్యేయమని వెల్లడి

**నిడదవోలు ఆగస్టు 09 అనంత జనశక్తి న్యూస్**

నిడదవోలు మండలంలో పవిత్ర ఆషాఢ మాస ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ఆదివారం మండల పరిధిలోని పందలపర్రు, తిమ్మరాజుపాలెం గ్రామాల్లోని ప్రముఖ ఆలయాలను సందర్శించి అమ్మవార్ల కృపాకటాక్షాలకై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పందలపర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోగులమ్మ తల్లి, శ్రీ మహాలక్ష్మీ తల్లి, శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవార్లను మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఆషాఢ మాస పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా "ఆషాఢ సారె" సమర్పించి, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం తిమ్మరాజుపాలెంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దివ్యక్షేత్రాన్ని మంత్రివర్యులు దుర్గేష్ సందర్శించారు.
ఆషాఢ మాస ఉత్సవాలలో భాగంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో "శాకాంబరీ దేవి" గా విశేష అలంకరణలో భక్తులకు దివ్య దర్శనమిస్తున్న శ్రీ కోటసత్తెమ్మ తల్లిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రివర్యులకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సకల శుభాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అన్ని
రంగాల్లోనూ ముందంజ వేసి సమగ్ర అభివృద్ధి సాధించాలని శ్రీ కోటసత్తెమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తజనానికి మంత్రి దుర్గేష్ అభివాదం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత డయాబెటిక్ శిబిరమునకు విశేష స్పందన.



- యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి జయరాం, కోశాధికారి వెంకట నాగార్జున.

**ధర్మవరం ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని కొత్తపేట, రాంనగర్ లోని శ్రీ ఉషోదయ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల యందు నిర్వహించిన ఉచిత డయాబెటిక్ శిబిరమునకు విశేష స్పందన రావడం జరిగిందని యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి జయరాం కోశాధికారి వెంకట నాగార్జున, క్యాంపు నిర్వహకులు రాధాకృష్ణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఈ శిబిరానికి డాక్టర్ నెట్టెం శ్రీకాంత్ చౌదరి రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరం యువర్స్ ఫౌండేషన్, మీనాక్షి ఎండోక్రయిన్ అండ్ పీడియాట్రిక్ సెంటర్ అనంతపురం వారి సహకారంతో నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలతో పాటు ఉచితంగా చేస్తూ ఉచితంగా మందులను కూడా పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ శిబిరంలో 150 మంది రోగులకు వైద్య చికిత్సలను అందించడం జరిగిందన్నారు. ఇప్పటికే యువర్స్ ఫౌండేషన్ సంస్థ పలు రకాల సేవలను అందిస్తూ ప్రజల వద్ద మంచి గుర్తింపు పొందడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డివి సుబ్బారావు, రత్రశాల మల్లికార్జున, భీమిశెట్టి కృష్ణమూర్తి, చాంద్ భాషా, మాజీ కౌన్సిలర్ కేత లోకేష్, కళ్యాణ చక్రవర్తి, సాకే వాసు, పోలా ప్రభాకర్, శివారెడ్డి, గేలి శివ తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ లో విద్యార్థుల ప్రతిభ.



- రీజనల్ లెవెల్ అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రభంజనం

**ధర్మవరం ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్:**

రీజనల్ లెవెల్ అబాకస్ పోటీల్లో ధర్మవరం మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్స్ నిలిచారని మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంచైజీ హెడ్ చంద్రశేఖర్లు తెలిపారు. ఆదివారం తాడిపత్రి ప్రణవ్ అబాకస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజనల్ లెవెల్ అబాకస్ కాంపిటీషన్స్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ..... 'మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు విష్ణు, సత్య ఆరుష్లు ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ సాధించారన్నారు. రేయన్షి, జగన్నాథ్, అవనీశ్, ఇహాన్, జయనందన్, పన్విత్ శౌర్య, రంజిత్, ఆదిత్యసాయిలు ఛాంపియన్షిప్ సాధించారన్నారు. గ్రీష్మ, ఇషాన్, దీక్షిత్ కుమార్, యశస్విన్, మహిత్, అశ్విన్, గగనదీప్, యువనేష్లు టాపర్స్గా నిలిచారని తెలిపారు. మోనిత్, కుందన, మిధున్, శాన్వికప్రియ, హర్షవర్ధన్, దీక్షిత్లు విన్నర్స్ కప్ సాధించారని తెలిపారు. గత 18 సంవత్సరాలుగా తమ విద్యార్థులు, రీజనల్, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభచూపి బహుమతులు సాధించడం గర్వకారణమని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి అభినందించారు.

## నేడు రేవెన్యు భవన్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



- అర్జీలను "meekosam.ap.gov.in" వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు
- అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

**పుట్టపర్తి,ఆగస్టు 9:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్. ఆర్. శంకరన్ హాల్) లో రేపు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుంది. ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ నెల 10న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. రేవెన్యు భవన్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మమ్మల్ని ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించాలి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 3 కిలోమీటర్ల పాదయాత్ర
- గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలి.. భూములకు రక్షణ కల్పించాలి

**అనంతగిరి ఆగస్టు 09 అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి-ఎన్ఆర్పురం పంచాయతీ పరిధిలో గిరిజన యువకులు, గ్రామస్తులు 3 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. తమ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చి, తమను ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సంప్రదాయ అడ్డాకుల టోపీలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. బూరుగ, చిన్నకోనెల, బొంగిజ, రాయపాడు, చిమిడివలస తదితర గ్రామాల యువకులు, గ్రామస్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. తమ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



**పేరుకే గిరిజనులు... హక్కులు మాత్రం లేవు**

అనంతగిరి మండలంలోని రొంపల్లి, ఎన్ఆర్పురం, భీంపోలు, గుమ్మకోట, గరుగుబెల్లి ఐదు పంచాయతీల పరిధిలో సుమారు 64 గిరిజన రెవెన్యూ గ్రామాలు, దాదాపు 20 వేల మంది నాన్‌షెడ్యూల్ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామాల్లో 97 శాతం మంది గిరిజనులే నివసిస్తున్నప్పటికీ, తమను ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించకపోవడంతో అనేక చట్టపరమైన హక్కులు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 1/70 చట్టం, పీసా చట్టం తదితర రక్షణలు తమకు అందడం లేదని తెలిపారు.

**భూములకు రక్షణ కల్పించాలి**

తమ తల్లిదండ్రులకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి, వారి అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని భూముల రికార్డుల్లో మార్పులు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొంతమంది రెవెన్యూ అధికారుల కుమ్మక్కుతో తమ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపించారు. భూముల సమస్యలపై రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తే సివిల్ కోర్టుకు వెళ్లాలని సూచిస్తున్నారని, కోర్టు కేసులకు లక్షల రూపాయలు ఖర్చవుతుండటంతో పేద గిరిజనులు న్యాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్డు, వైద్య సౌకర్యాలు కల్పించాలి**

ఎన్ఆర్పురం పెద్దూరు నుంచి రాయపాడు, చిమిడివలస, బొంగిజ, చిన్నకోనెల, బూరుగ మీదుగా వాణిజ వరకు తారు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఓటు హక్కు వినియోగించుకోవాలంటే సుమారు 13 కిలోమీటర్లు, వైద్య సేవల కోసం దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. తమ గ్రామాలకు కనీస రహదారి, వైద్య సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ఇప్పటికైనా తమ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చి, ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు సభ్యుడు సోమీల అప్పలరాజు, కోటపర్తి సింహాచలంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటికి నగరంలో భారీ ఏర్పాట్లు




- ఎటు చూసినా శుభాకాంక్షలు తెలుపుతూ వెలసిన ఫ్లెక్సీలు
- 50డివిజన్లు, 4పంచాయతీల్లో వేడుకలకు ఏర్పాట్లు
- దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్లలో 3పూటల ఉచితంగా భోజనం సౌకర్యం

**అనంతపురం ఆగస్ట్ 09, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలకు నియోజకవర్గంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 10(సోమవారం) రోజున ఈ వేడుకలు జరగనున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఈ వేడుకల్ని భారీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ముఖ్యంగా నగరంలోని 50డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రధాన వీధులతో పాటు ప్రతి డివిజన్ లోనూ ఇలాంటివి కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రి, రాంనగర్ బ్రిడ్జి దగ్గర నుంచి అర్బన్ టీడీపీ కార్యాలయంలో వరకు ఫ్లెక్సీలతో నింపేశారు. గతంలో అర్బన్ కార్యాలయంలో భారీగా వేడుకలు నిర్వహించే వారు. ఈసారి అలా కాకుండా ఎక్కడికక్కడ ఏ డివిజన్ లో వారు నిర్వహించుకోవాలని దగ్గుపాటి కార్యాలయ సిబ్బంది సూచించారు. మరోవైపు దగ్గుపాటి ఫౌండేషన్ తో పాటు టీడీపీ నాయకులు కూడా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు వెల్లడించారు. అన్నదానం, రక్తదానంతో పాటు వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు ఉంటాయని చెబుతున్నారు. దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మూడు అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఉచితంగా భోజనం అందించబోతున్నారు.

## ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయండి.

**శెట్టూరు ఆగస్టు 9 అనంత జనశక్తి న్యూస్.**

శెట్టూరు మండలం మాకోడికి. లక్ష్మ0పల్లి గ్రామంలో సోమవారం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలీనేని సురేంద్రబాబు పర్యటన నిమిత్తం. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని ముందుగా మాకోడికి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైకిల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు తర్వాత లక్ష్మ0పల్లి గ్రామంలో జరిగే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైకిల్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటున్నారు కావున మండలంలోని ప్రతి ఒక్క తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలు మండల కన్వీనర్ తెలియజేశారు



## గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 09 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి సాయి నగర్ కు చెందిన తిప్పన్న అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కుటుంబానికి సాయి ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ, ఆధ్వర్యంలో తిప్పన కుటుంబానికి ఆదివారం 70వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. 1989వ పదవ తరగతి బ్యాచ్ తిప్పన్న మిత్ర బృందం అతని కుటుంబాన్ని ఏ విధంగానైనా ఆదుకోవాలని దృక్పథంతో ఈ సహకారాన్ని అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తిప్పన్న కుటుంబ సభ్యులకు 70, వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ తమ మిత్రులకు ఎలాంటి కష్టం వచ్చినా సహాయ సహకారాలు అందిస్తూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా సోమశేఖర్ , పచ్చా రమేష్ ,కన్నయ్య, శంకర్, బాబు ,శ్రీరామ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.







# గిరిజన గ్రామాలు... అడవి తల్లి బాటలు





- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతర పర్యవేక్షణలో రహదారి పనుల్లో స్పష్టమైన పురోగతి
- అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్లతో 1,069 కి.మీ. రహదారుల అభివృద్ధికి శ్రీకారం
- అడవితల్లి బాట 2.0 విస్తరణతో మొత్తం రూ. 2,078 కోట్లతో 2,310 కి.మీ. రహదారుల అభివృద్ధి
- విస్తరణ పనుల్లో ఇప్పటికే 905 కి.మీ. రహదారుల నిర్మాణం పూర్తి
- పెండింగ్ పనులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షించిన ఉపముఖ్యమంత్రివర్యులు
- మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- అటవీ అనుమతులు జాప్యం లేకుండా సమన్వయం చేసుకోవాలి
- వర్షా ల వల్ల ఆటంకాలు ఉన్న రోడ్లు మినహా మిగిలిన పనులు కొనసాగించాలి
- డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని పిలుపు

**విజయవాడ ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో డోలీరహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా చేపట్టిన అడవితల్లి బాట పనులు స్పష్టమైన పురోగతి దిశగా సాగుతున్నాయి.అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్ల అంచనా వ్యయంతో 1,069 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తూ అడవితల్లిబాట 2.0ను ప్రారంభించడం జరిగింది. ఈ విస్తరణతో మొత్తం ప్రాజెక్టును రూ. 2,078 కోట్ల అంచనా వ్యయంతో 2,310 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి విస్తరించడం జరిగింది. ఇందులో ఇప్పటికే 905 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తైంది.అడవితల్లిబాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా పవన్ కళ్యాణ్ సూచనలు చేస్తున్నారు.

**సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం**

అడవితల్లిబాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడం కంటే ముందు దారి నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గుట్టలను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ ద్వారా బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాల నుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంకల్పంతో ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు.

**ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలి :పవన్ కళ్యాణ్**

అడవితల్లిబాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన పవన్ కళ్యాణ్ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో చేపట్టిన అడవితల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరు

- ఆర్టీపీపీ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి: కామనూరు శ్రీనివాసులురెడ్డి

**కడప, ఆగస్టు 9:అనంత జనశక్తి న్యూస్**

బెదిరింపులు, ఆంక్షలతో కార్మికుల ఉద్యమాలను అడ్డుకోలేరని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. కడప నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని డాక్టర్ ఎం.వి.ఆర్. రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఆర్టీపీపీ) యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల హక్కులను కాలరాసే విధంగా జారీ చేసిన సర్క్యులర్ మెమో నంబర్ 507/26ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కూడా ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపిందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఆర్టీపీపీ యాజమాన్యం ప్రయత్నిస్తోందని శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. కార్మికులను పరిశ్రమ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లనివ్వకపోవడం, సెలవులు నిరాకరించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం అప్రజాస్వామిక చర్యలని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని 19(1) అధికరణం కల్పించిన ప్రశాంతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం చట్టవిరుద్ధమని అన్నారు. కార్మికుల ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా పని చేయించడం కూడా చట్టపరంగా ప్రశ్నించదగిన అంశమని పేర్కొన్నారు. ఆర్టీపీపీ యాజమాన్యం సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోకపోతే కడప జిల్లా కార్మిక శాఖ అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎన్ని ఆంక్షలు, బెదిరింపులు ఎదురైనా కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ కోసం పోరాటం కొనసాగుతుందని, ఆగస్టు 10న తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమం జరిగి తీరుతుందని కామనూరు శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు.



# చెరువులో మృతదేహం

- ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి హత్య....
- ధర్మవరం ఆగష్టు 9 అనంత జనశక్తి న్యూస్
- ధర్మవరం*చెరువులో మృతదేహం*
- ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి హత్య....

**ధర్మవరం ఆగష్టు 9 అనంత జనశక్తి న్యూస్**

ధర్మవరం చెరువు రెండు మరువ వద్ద దారుణ హత్య వెలుగు చూసింది. ఓబులనాయన పల్లి గ్రామానికి చెందిన బోయ దాసరి శ్రీనివాసులు (40)సం, హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు శ్రీనివాసులను హత్య చేసి అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేసినట్లు సమాచారం.

మృతుడు శ్రీనివాసులకు ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు, నిందితులు ఎవరనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. వ్యక్తిగత కక్షలా, ఇతర కారణాలా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డీఎస్పీ, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సీఐ జయనాయక్‌తో పాటు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ హత్యకు గల కారణాలను నిగ్గుతేల్చేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.రెండు మరువ ప్రాంతంలో దారుణ హత్య వెలుగుచూసింది. ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన బోయ దాసరి శ్రీనివాసులు (40) సం, హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు శ్రీనివాసులను హత్య చేసి అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేసినట్లు సమాచారం.

మృతుడు శ్రీనివాసులకు ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు, నిందితులు ఎవరనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. వ్యక్తిగత కక్షలా, ఇతర కారణాలా అనే కోణాల్లో పోలీసులు



దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డీఎస్పీ, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సీఐ జయనాయక్‌తో పాటు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ హత్యకు గల కారణాలను నిగ్గుతేల్చేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అన్న ప్రసాద సేవ ట్రస్ట్ కు లక్ష విరాళం అందజేసిన

# రిటైర్డ్ తాహాశీల్దార్ రామయ్య



**లేపాక్షి, ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర అన్న ప్రసాద సేవా ట్రస్ట్ కు ఆదివారం కర్నూలు జిల్లాకు చెందిన రిటైర్డ్ తహశీల్దార్ అలవాల రామయ్య లక్ష రూపాయలు ట్రస్ట్ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, తన తండ్రి వెంకట లక్ష్మీనారాయణ, భార్య సుభాషిని జ్ఞాపకార్థం ఈ అన్నదాన సేవా ట్రస్ట్ కు శాశ్వత చెందాగా లక్ష రూపాయలు అందజేయడం జరిగిందని తెలియజేశారు. వీరికి ట్రస్ట్ సభ్యులు శాలువాతో సన్మానించి నంది మెమెంటోను కృతజ్ఞతగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కరణం రాంప్రసాద్, వెచ్చం రవీంద్రనాథ్, వీరన్న,అంజన్ రెడ్డి, హనుమంతు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



- జిల్లా ఎస్పీ పి. జగదీష్
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా పోలీస్ శాఖ మొక్కల పెంపకం కార్యక్రమం
- పోలీసు స్టేషన్ ఆవరణ, పరిసరాలలో పచ్చదనం నింపడమే లక్ష్యం

**అనంతపురం ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్**

విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వివిధ పోలీసు స్టేషన్ల ఆవరణలు, పరిసర ప్రాంతాల్లో నీడనిచ్చేవి, ఫలాలనిచ్చే మొక్కలను నాటి, వాటికి నీళ్లు పోశారు. "ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా చేపట్టిన ఈ హరిత హారం కార్యక్రమం పోలీస్ స్టేషన్లకు నూతన శోభను ఇస్తుందని ఆయా పోలీసు అధికారులు తెలియజేశారు. ఆయా కార్యక్రమాలలో జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దాతృత్వపు ధార... సేవా సుగంధం.



- నాగుల ప్రతిష్ఠామహోత్సవానికి సంధా రాఘవ విరాళం
- శ్రీ అహోబిలేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలకు రూ.10 వేల ఆర్థిక సహాయం..

**ధర్మవరం ఆగష్టు 9 అనంత జనశక్తి న్యూస్**

ధర్మవరం మండలం కుణుతూరు పంచాయతీ పరిధిలోని కామిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించనున్న శ్రీ అహోబిలేశ్వర స్వామి నాగుల ప్రతిష్ఠామహోత్సవం కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, పట్టణ చేనేత ప్రముఖులు సంధా రాఘవను కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు తన వంతు సహాయంగా రూ.10,000 విరాళాన్ని సంధా రాఘవ అందజేశారు. అనంతరం ఆలయ కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠామహోత్సవం భక్తిశ్రద్ధలతో విజయవంతం కావాలని, శ్రీ అహోబిలేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆయన కోరుకున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చిన్న వయసులోనే అందించడంతో పలువురు ఆయన చిరునవ్వే దాతృత్వపు ధార... ఆయన సేవకు సుగంధం గా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదివాసీల అభివృద్ధితోనే సమాజ సమగ్ర అభివృద్ధి

- ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం, ఆగస్టు 9:అనంత జనశక్తి న్యూస్**

ఆదివాసీల అభివృద్ధి అంటే కేవలం ఒక వర్గం అభివృద్ధి కాదని, అది సమాజ సమగ్ర అభివృద్ధికి ప్రతీక అని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఏకలవ్యుడు, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సంత్ లాల్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆదివాసీ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ ఆదివాసీలు దేశానికి మూలవాసులు మాత్రమే కాకుండా ప్రకృతి, అడవులు, సంప్రదాయాలు, సంస్కృతి, జీవ వైవిధ్యానికి సంరక్షకులని అన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ తరతరాలుగా తమ విలువైన సంప్రదాయాలను కాపాడుతున్న ఆదివాసీ సమాజం దేశానికి గర్వకారణమన్నారు.ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వారి సంస్కృతి, భాష, సంప్రదాయాలు అంతరించిపోకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, ఎస్టీ సంఘాల




నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకతాయిల ఆట కట్టించిన పోలీసులు



- పుట్టిన రోజు వేడుకల పేరుతో హంగామా
- ద్విచక్ర వాహనాలపై విన్యాసాలు
- తొమ్మిది మందిపై కేసు నమోదు
- సీఐ శివరాముడు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్

**ముదిగుబ్బ ఆగస్టు 09 అనంత జనశక్తి న్యూస్**

మిత్రుడి పుట్టినరోజు వేడుకల పేరుతో బహిరంగ ప్రదేశంలో హంగామా చేస్తూ, ద్విచక్ర వాహనాలపై విన్యాసాలు చేస్తూ పరిసర ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన తొమ్మిది మంది యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల తో ముదిగుబ్బ మండలంలోని ఇందుకూరు గ్రామంలో తొమ్మిది మంది యువకులు కలిసి పుట్టినరోజు వేడుకల పేరుతో బహిరంగంగా కేక్ కట్ చేసి, అనంతరం ద్విచక్ర వాహనాలపై ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ హంగామా చేసినట్లు పోలీసులు గుర్తించారు. వారి చర్యలతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులకు గురైనట్లు సమాచారం. విషయం పోలీసుల దృష్టికి రావడంతో యువకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, అర్బన్ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం, ద్విచక్ర వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు చేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పోలీసులు వారికి వివరించారు. ఇకపై ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పుట్టినరోజు వేడుకలు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జరుపుకోవాలని సీఐ శివరాముడు సూచించారు. పోలీసులు తీసుకున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## నరసాపురంలో 700 మంది క్రోచెట్ లేస్ కళాకారులకు కంటి పరీక్షలు

- 552 మందికి దృష్టి లోపాలు, 40 మందికి శుక్లాల గుర్తింపు
- ఉచిత కళ్లద్దాలు, శస్త్రచికిత్స సదుపాయం
- ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో వరుస నేత్ర వైద్య శిబిరాలు

**నరసాపురం ఆగస్టు 09,అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో నరసాపురం ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్లో 700 మంది క్రోచెట్ లేస్ కళాకారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హస్త కళా మహోత్సవం వేదికపై నుంచి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన సూచనలతో నిరంతర పర్యవేక్షణ ఫలితంగా ఇప్పటికే 141 మంది క్రోచిట్ లేస్ కళాకారులకు ఉచిత కళ్లద్దాలు అందజేశారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆదివారం మరో 700 మంది లేస్ కళాకారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కాకినాడకు చెందిన కిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ ఉచిత నేత్ర వ...



## పిడుగుపాటు ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**శ్రీకాకుళం, ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్**



పలాస నియోజకవర్గం మందస మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన పాతకోటలో పిడుగుపడి ఇద్దరు మహిళలు మృతి చెందడం అత్యంత బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
పిడుగుపాటు ఘటనలో సుమిద్రి, జోరా అనే ఇద్దరు మహిళలు మృతి చెందడం పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు.
మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.అదేవిధంగా పిడుగుపాటు ఘటనలో మరో నలుగురు గాయపడటం పట్ల మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారికి హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య చికిత్సపై అధికారులను ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు, సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన వైద్య సహాయాన్ని తక్షణమే అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

# ఆదివాసీల అభివృద్ధితోనే సమాజ సమగ్ర అభివృద్ధి



- ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం, ఆగస్టు 9:అనంత జనశక్తి న్యూస్**

ఆదివాసీల అభివృద్ధి అంటే కేవలం ఒక వర్గం అభివృద్ధి కాదని, అది సమాజ సమగ్ర అభివృద్ధికి ప్రతీక అని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఏకలవ్యుడు, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సంత్ లాల్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆదివాసీ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ ఆదివాసీలు దేశానికి మూలవాసులు మాత్రమే కాకుండా ప్రకృతి, అడవులు, సంప్రదాయాలు, సంస్కృతి, జీవ వైవిధ్యానికి సంరక్షకులని అన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ తరతరాలుగా తమ విలువైన సంప్రదాయాలను కాపాడుతున్న ఆదివాసీ సమాజం దేశానికి గర్వకారణమన్నారు.ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వారి సంస్కృతి, భాష, సంప్రదాయాలు అంతరించిపోకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, ఎస్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోలార్ ప్రాజెక్ట్‌కు కృషి చేసిన ఎమ్మెల్యేకు కిసాన్ మోర్చా కృతజ్ఞతలు

- ప్రభావిత రైతులు, కౌలు రైతులకు న్యాయం చేయాలి: బీజేపీ కిసాన్ మోర్చా

**ఆమడగూరు, ఆగస్టు 9 ,అనంత జనశక్తి న్యూస్**



శ్రీ సత్యసాయి జిల్లా ఆమడగూరు మండలంలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు కృషి చేసిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింతా శరత్ కుమార్ రెడ్డి తెలిపారు.ఆమడగూరు మండలంలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశాలు ఏర్పడుతున్నాయని అన్నారు. అయితే ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోతున్న రైతుల ప్రయోజనాలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న సొంత భూమి రైతులతో పాటు కౌలు రైతులను కూడా గుర్తించి, అర్హులైన వారికి వెంటనే కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించడంతో పాటు, ప్రతి ప్రభావిత కుటుంబంలో అర్హత ఉన్న ఒకరికి ఉద్యోగం లేదా స్థిరమైన ఉపాధి కల్పించాలని కోరారు. ప్రాజెక్ట్ ద్వారా ఏర్పడే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థానిక రైతులు, యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను గుర్తించి, ప్రాజెక్ట్ కారణంగా వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా తగిన న్యాయం చేయాలని కోరారు.కిసాన్ మోర్చా కౌలు రైతుల రాష్ట్ర సహ కన్వీనర్ సోమగుట్ట హనుమంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కౌలు రైతుల ఓబీసీ మండల కన్వీనర్ జగదీశ్ తదితరులు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి రైతులు, కౌలు రైతులు, పాడి రైతులు, గొర్రెల పెంపకందారుల సమస్యలను అధ్యయనం చేస్తామని తెలిపారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ప్రజా ప్రతినిధులు, అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.సోలార్ ప్రాజెక్ట్‌తో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, పాడి పరిశ్రమ, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఇతర ఉపాధి అవకాశాలను ఆమడగూరు ప్రాంతానికి తీసుకురావాలని, తద్వారా స్థానిక రైతులు, యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మెడికో ప్రియాంక మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి



- సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బాధితురాలి కుటుంబానికి ఇప్పటివరకు అయిన వైద్య ఖర్చులతో పాటు రూ. 20 లక్షల పరిహారం ప్రకటన
- కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ

**రాజమహేంద్రవరం ఆగస్టు 09 అనంత జనశక్తి న్యూస్**

సికింద్రాబాద్‌లో చికిత్స పొందుతూ రాజమహేంద్రవరానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. ఈ విచారకర ఘటనను మొదటి నుండి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించిందని ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. నిర్లక్ష్యంతో నిండు ప్రాణాన్ని బలితీసుకున్న బాధ్యులెవరినీ విడిచిపెట్టేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. బాధ్యులకు కఠిన శిక్ష పడేలా సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. మృతురాలు ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ. 20 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించినట్లు వెల్లడించారు. అంతేగాక ఇప్పటి వరకు ప్రియాంక చికిత్స కోసం అయిన మొత్తం ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తామని వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తక్షణమే స్పందించి తగిన చర్యలకు ఆదేశించారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని, తగిన న్యాయం చేకూరుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# వేడుకగా నారాయణ స్కూల్స్ ఆస్పైర్ సమ్మిట్ 3.0



**నెల్లూరు ఆగస్ట్ 09,అనంత జనశక్తి న్యూస్**

ఆదివారం నెల్లూరు నగరంలోని స్థానిక ముత్తుకూరు రోడ్డు నందుగల శ్రీ పచ్చి పులుసు కళ్యాణ మండపంలో నారాయణ పాఠశాలల రాష్ట్రస్థాయి ఆస్పైర్ సమ్మిట్ 3.0 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ లు పొంగూరు రమాదేవి, గంట రవితేజ, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, డీజీఎం కొండలరావు, హనుమంతరావు తదితరులు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమ్మెట్ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ఉద్యోగులకు వివరించారు. 202526 విద్యా సంవత్సరంలో విద్యాసంస్థలలో వివిధ విభాగాల అధిపతులు ఉపాధ్యాయులు సాధించిన పురోగతిని కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రకాల స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ యోగా తరగతులు, క్రీడా పోటీలు నిర్వహించడమే కాకుండా ఉత్తీర్ణత శాతం మరింత పెరిగేలా తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల పురోగతి శాతం మరింత పెరిగిందని అలాగే 10వ తరగతి ఫలితాలలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలను అందిపుచ్చుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి పని చేసి సంస్థ అభివృద్ధికి సహకారం అందించాలని, ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం రాష్ట్రంలోని నారాయణ స్కూల్స్ లో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను, నగదు ప్రోత్సాహకాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు ముందుగా నారాయణ గోమతి స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్ సి సి విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి నారాయణ స్కూల్స్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గోరుకల్లు రిజర్వాయర్ దుస్థితికి ఎవరు కారణం?

- రిజర్వాయర్ దుస్థితిని పరిశీలించిన వైఎస్ఆర్సిపి ప్రాజెక్టుల టాస్క్ ఫోర్స్!

**కె.వి రమణ,**
**రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి,**
**వైయస్సార్సీపి, అనంతపురం.**

ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడటానికి కీలకమైన శ్రీబాగ్ ఒడంబడిక ద్వారా రాయలసీమకు లభించిన హక్కుల్లో భాగంగా,నికర జలాల ఆధారంగా సాధించుకున్న ఏకైక ప్రధాన సాగునీటి ప్రాజెక్టు ఎస్ఆర్‌బీసీ మాత్రమే.

ఈ ప్రాజెక్టు లక్ష్యం కర్నూలు జిల్లాలోని బనగానపల్లి ,కోవెలకుంట్ల, ఔకు,కడప జిల్లాలోని జమ్మలమడుగు ప్రాంతాలకు తాగు,సాగునీరు అందించడం.

నేరుగా బైపాస్ కెనాల్ ద్వారా ఎస్ఆర్‌బీసీ ఆయకట్టుకు నీరందించే విధంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేయడంతో,ఆయకట్టు రైతులకు శాశ్వతమైన నీటి భరోసా లేకుండా పోయింది.

ఈ లోటును గుర్తించిన వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు 2004లో అధికారం చేపట్టి,తన జలయజ్ఞంలో భాగంగా 2006లో 12.44 టీఎంసీల సామర్థ్యంతో గోరకల్లు రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభి, 2014కు 95% పూర్తి చేశారు.రాజశేఖర్ రెడ్డి మరణానంతరం రాష్ట్రం చీలిపోయిన తర్వాత 2014లో నవ్యాంధ్రప్రదేశ్‌కు మొదటి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల, ఆ ప్రాంత ప్రజలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగా ఇన్‌ఫ్లో రెగ్యులేటర్లు,రిజర్వాయర్ రివెట్‌మెంట్ తదితర పనులు చేపట్టే దిశగా ప్రభుత్వం ముందుకు కదిలి 2016 పూర్తి చేసి ప్రారంభించినా 2019 నాటికి కూడా అనేక కీలక పనులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి.ప్రాజెక్టులో సుమారు 95శాతం పనులు వైయస్సార్ పూర్తి చేసినప్పటికినీ మిగిలిన అత్యంత కీలకమైన 5 శాతం పనుల్లో భాగమైన రివెట్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం ,అలల తాకిడిని తట్టుకునే స్థాయిలో రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలు తర్వాత తీవ్ర సమస్యలకు దారితీశాయి. రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసిన అనంతరం అలల తాకిడితో గతంలో ఏర్పాటు చేసిన రివెట్‌మెంట్‌లోని కొన్ని ప్రాంతాలు కుంగిపోవడం దీనికి నిదర్శనం.ఇప్పుడు పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టుకు ఆయువుపట్టులాంటి గోరుకల్లు రిజర్వాయర్ లో గతంలో నిర్మించిన రివెట్‌మెంట్‌లో కొంత భాగం కుంగిపోవడంతో పాటు, రిజర్వాయర్ వెలపలి వైపు ఉన్న మట్టి కట్టలను తగిన స్థాయిలో బలోపేతం చేయకపోవడం వల్ల ప్రస్తుతం ఆ కట్టలు కూడా బలహీనపడుతున్న పరిస్థితి అత్యంత ఆందోళన కలిగిస్తోంది.ఇది రిజర్వాయర్ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశం.
దురదృష్టవశాత్తు తెలుగుదేశం ఐదు సంవత్సరములలో ఈ పనులను పూర్తిచేయడానికి అవసరమైన ప్రాధాన్యత ఇవ్వకుండా,దీనిని రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టుగా భావించి నిర్లక్ష్యం చేశారు. వారు చేయాల్సిన సమయంలో చేయకుండా ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ విధ్వంసం చేసిందని ఆరోపణలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. వర్షాకాలానికి ముందే పూర్తి చేయాల్సిన నిర్వహణ,మరమ్మతు పనులను చేపట్టకుండా, అనుమతులు ఇచ్చాం, నిధులు కేటాయించాం, పనులు పూర్తి చేస్తాం,అనే ప్రకటనలతో కాలం వెళ్లదీస్తున్నారు.

ఇది రాయలసీమలోని విస్తారమైన ప్రాంతానికి సామాజిక,ఆర్థిక జీవనానికి ఆధారం.ఈ రిజర్వాయర్ భద్రతకు ఏదైనా ముప్పు ఏర్పడితే దాని ప్రభావం కేవలం ఆయకట్టు రైతులపైనే కాకుండా, లక్షలాది ప్రజల జీవన పరిస్థితులపై తీవ్రంగా పడే ప్రమాదం ఉంది.గత ఎన్నికలలో చంద్రబాబు దీని భద్రతకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది కావున తక్షణ కార్యాచరణకు పూనుకోవాలి.

రిజర్వాయర్ రివెట్‌మెంట్,రక్షణ పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని కీలక పనులను కాలపరిమితిలో పూర్తి చేయాలి.రిజర్వాయర్ మట్టి కట్టలపై తక్షణమే సాంకేతిక నిపుణులతో సమగ్ర భద్రతా తనిఖీ నిర్వహించాలి.రిజర్వాయరు అంతర్భాగంగా ఉన్న రెండు వంకల నుండి ఆకస్మికంగా వరద వచ్చిన సందర్భంలో రిజర్వాయర్ ను కాపాడడానికి స్పిల్ వే పనులను తక్షణమే పూర్తి చేయాలి.బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అత్యవసర మరమ్మతులు చేసి బలోపేతం చేయాలి.రిజర్వాయర్ భద్రతకు సంబంధించిన సాంకేతిక తనిఖీ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత నిర్వహణ,పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, చారిత్రాత్మకంగా అన్యాయానికి గురైన రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టుల అసంపూర్తి పనులు,నిర్వహణ లోపాలు,రిజర్వాయర్ల భద్రత,పెండింగ్ పనులు, నిధుల వినియోగం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలి.

గోరుకల్లు రిజర్వాయర్ భద్రతతో పాటు, ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి,రాయలసీమ రైతులకు శాశ్వతమైన సాగునీటి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వైయస్సార్సీపి టాస్క్ ఫోర్స్ పరిశీలి నా బృందం ప్రభుత్వానికి తెలియజేస్తున్నది.

## ఘనంగా కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం

# నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం





**- ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ముందుకు సాగాలి: టీజీ వెంకటేష్**

**బద్వేల్ అర్బన్, ఆగస్టు 9 (అనంత జనశక్తి న్యూస్):**

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బద్వేల్ పట్టణంలోని చెన్నంపల్లి సమీపంలో ఉన్న ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు, సంఘ ప్రతినిధులు హాజరయ్యారు.కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వల్లంకొండు వెంకటరమణ, కార్యదర్శిగా సీవీ నాగేశ్వరరావు, కోశాధికారిగా పద్ధతి చంద్రశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యెలిశెట్టి గురుప్రసాద్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాజా వెంకట వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కుంజేటి అరుణ, కోశాధికారిగా దేవత లలిత తదితరులు బాధ్యతలు స్వీకరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు శ్రేష్టి, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సొల్లేటి రమణ నేతృత్వంలో క్రేన్ సహాయంతో భారీ గజమాలతో అతిథులను సత్కరించారు. అనంతరం కోలాటాలు, భజంత్రీలు, వేద పండితుల పూర్ణకుంభ స్వాగతం మధ్య వారిని సభా ప్రాంగణానికి తీసుకెళ్లారు. జ్యోతి ప్రజ్వలన, అమ్మవారి ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది.

**ఐకమత్యంతోనే గుర్తింపు**

ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్యవైశ్యులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఐక్యతతో ఉన్నప్పుడే సమాజంలో, అన్ని రాజకీయ పార్టీల్లో ఆర్యవైశ్యులకు తగిన గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. వ్యాపార రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ ఆర్యవైశ్యులు రాణించాలని సూచించారు. పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కష్టాల్లో ఉన్న ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు.రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ కడప జిల్లాలో ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సభ్యత్వ నమోదులో కడప జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం వెనుక జిల్లా అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు.విజయవాడలో నిర్మిస్తున్న ఆర్యవైశ్య భవన్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయంగా ఏ పార్టీలో ఉన్నప్పటికీ సంఘం విషయానికి వచ్చేసరికి ఐకమత్యంగా ఉండాలని సూచించారు.

**ఆర్యవైశ్య భవన్‌కు విరాళాలు**

విజయవాడలో నిర్మిస్తున్న నూతన ఆర్యవైశ్య భవన్ నిర్మాణానికి జిల్లాకు చెందిన పలువురు విరాళాలు ప్రకటించారు. సొల్లేటి వెంకటరమణ, భవనాసి సత్యనారాయణ, బల్లాని చెన్నకేశవ ప్రసాద్, అయ్యప్ప శెట్టి సురేష్‌బాబు, ప్రొద్దుటూరుకు చెందిన గోపాలకృష్ణ తదితరులు విరాళాలు ప్రకటించారు. విరాళదాతలను టీజీ వెంకటేష్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరు రంగనాథ్, ఐటీ, సభ్యత్వ అభివృద్ధి కమిటీ చైర్మన్ చక్కా సూర్యప్రకాష్, బైలాస్ కమిటీ చైర్మన్ చెక్క చెన్నకేశవరావు, రాష్ట్ర కార్యదర్శి పేరూరు గాంధీ, కడప జిల్లా సంఘ గౌరవాధ్యక్షులు పీవీఎన్ ప్రసాద్, కుప్పం వెంకట సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి చిన్న సుబ్బారావు, రాష్ట్ర డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు చిప్పగిరి వెంకట ప్రసాద్, టంగుటూరి మారుతి ప్రసాద్, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు దొంతు సుబ్రహ్మణ్యం, మీడియా కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగుల శ్రీనివాసరావు, ఓబలశెట్టి రాధాకృష్ణ, కొణతాలపల్లి నరసింహులు, రామసుబ్బయ్య, సొల్లేటి వెంకటరమణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాచపుటి సాయికృష్ణ, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కరమలపుటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సుమారు 700 మందికి పైగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి, ప్రమాణ స్వీకార పత్రాలు అందజేశారు. అనంతరం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.





## మమతా బెనర్జీ కాన్వాయ్‌పై

# చెప్పులతో దాడి



(మొదటిపేజీ తరువాయి)

ఆమె ప్రయాణిస్తున్న కారుపై ఆందోళనకారులు దాడి చేశారు. తమపై గుర్తుతెలియని దుండగులు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారని, ఈ దాడిలో ప్రాణాలు పోయేవే అని మమత ఆరోపించారు. ఈ దాడిని రాష్ట్ర బీజేపీ ఖండించింది. ఈ హింసాకాండలో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పోలీస్ కస్టడీలో టీఎంసీ పార్టీ కార్యకర్త మరణించాడని ఆ పార్టీ బెంగాల్‌లో తీవ్ర నిరసన తెలుపుతోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యకర్తల ఇంటికి మమతా బెనర్జీ వెళ్తుండగా హాలిసహర్‌లో నిరసన ఎదుర్కొన్నారు. నిరసనకారులు మమతా బెనర్జీ కారును చుట్టుముట్టి దానిపై బురద రాసి, బూట్లు, నీళ్ల సీసాలు విసిరినట్లు తెలుస్తోంది. నిరసనకారుల్ని పోలీసులు వెనక్కి తోసేయడానికి ప్రయత్నించారు. మమతను ఉద్దేశిస్తూ ''దొంగను తరిమికొట్టండి'' అని నిరసనకారులు నినాదాలు చేశారు.
ఇటుకలు, రాళ్లు తమపై పడి ఉంటే తాను చనిపోయి ఉండేదాన్ని అని మమతా బెనర్జీ మీడియాతో అన్నారు. బయట నుంచి వచ్చిన సంఘవిద్రోహ శక్తులు పోలీసుల ముందే తన కారుపై దాడి చేశారని ఆమె ఆరోపించారు. నా కారు కిటీలు మూసి ఉండకపోతే, నా తల పగిపోయి, చనిపోయే దాన్ని అని, ఇలాంటి దాడిని ఎప్పుడూ ఎదుర్కోలేదని, మమ్మల్ని కాపాడటానికి పోలీసులు ఏం చేయలేదని, వాళ్లు కేవలం బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.
మమతా బెనర్జీ కాన్వాయ్‌పై జరిగిన దాడిని బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య ఖండించారు. ఈ ఘటనలో తమ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాళ్లు, బురద, చెప్పులు విసరడాన్ని బీజేపీ సమర్థించదని ఆయన అన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. టీఎంసీ కార్యకర్త బిర్జు కియోట్ పోలీసుల అదుపులో ఉన్న సమయంలో అనారోగ్యానికి గురై మరణించడంతో వివాదం మొదలైంది. పోలీసులు చిత్రహింసల వల్లే తమ పార్టీ కార్యకర్త మరణించారని టీఎంసీ ఆరోపిస్తోంది. ఈ సంఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని అతడి భార్య డిమాండ్ చేస్తోంది. పోలీసులు మాత్రం గుండెపోటు కారణంగానే అతను మరణించినట్లు స్పష్టం చేశారు.

# పోరాట యోధుడు కుమ్రం భీం



(మొదటిపేజీ తరువాయి)

ఎస్టీల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఆ తర్వాత ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.. తండాలను, గిరిజన గూడేలను గ్రామ పంచాయితీలు చేసిందని అన్నారు..
హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో ఆదివాసీ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా.. కుమ్రం భీం ఆదివాసీ భవనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం పేరు పెట్టడమే కాకుండా, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు.
తండాలకు, గూడేలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా చేయడం, ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం వంటి ఎన్నో కార్యక్రమాలు కూడా కేసీఆర్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా.. ఆదివాసీ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

**అమ్మవారి ఆశీస్సులతో వర్షా లు సమృద్ధిగా పడాలి : కేటీఆర్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం నగరంలోని పలు అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని, లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, హైదరాబాద్‌లో వ్యాపారాలు బాగా జరగాలని ఆకాంక్షించారు. .
అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా పడి, రైతులందరూ సంతోషంగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఓల్డ్ సిటీలోని బంగారు మైసమ్మ అమ్మవారిని, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని , నాంపల్లిలోని శ్రీ ఏడు గుళ్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.కేటీఆర్ వెంట మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు , ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుటు కేటీఆర్‌ను శాలువాతో సత్కరించారు.

# 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్**

**- కీలక బిల్లులు, ప్రజా సమస్యలపై చర్చ**

**అనంతపురం, ఆగస్టు 9 (అనంత జనశక్తి న్యూస్):**

ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. సమావేశాల ప్రారంభ తేదీలను ఖరారు చేస్తూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.... ఈ నెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయి. అలాగే ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేందుకు ఉభయ సభలు సిద్ధమవుతున్నాయి.
సమావేశాలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. సమావేశాలు ప్రారంభమయ్యే ముందు రోజే లేదా తొలి రోజు ఉదయాన్నే ఉభయ సభల బీఏసీ సమావేశమవుతుంది. సభ నిర్వహణ... అజెండాను ఈ కమిటీ ఖరారు చేయనుంది. ప్రాథమిక వివరాల ప్రకారం.... ఈ వర్షాకాల సమావేశాలను సుమారు 4 రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.
కీలక బిల్లులు, ప్రజా సమస్యలపై చర్చ....
నాలుగు రోజుల పరిమిత కాలంలోనే రాష్ట్రంలోని పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజారోగ్యం, వ్యవసాయం, సంక్షేమ పథకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శాసనసభ వేదికగా విపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వనుంది. వీటితో పాటు ప్రభుత్వం ప్రతిపాదించిన పలు కీలక బిల్లులను ఉభయ సభల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనున్నారు.
ప్రస్తుతం రాష్ట్రంలో అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. డీఎస్సీలో అక్రమాలంటూ వైసీపీ నేతలు నిరసనలు చేస్తున్నారు. ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలపై... విద్యాశాఖ కూడా క్లారిటీ ఇస్తూ వస్తోంది. అయినప్పటికీ... ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ప్రతిపక్ష నేతల ఆరోపణలు, విమర్శలను సీఎం చంద్రబాబుతో సహా మంత్రులందరూ కూడా కొట్టిపారేస్తున్నారు. ఇక భోగాపురం క్రెడిట్ విషయంలోనూ వైసీపీ, టీడీపీ నేతల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది.
ఈ నేపథ్యంలో ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ హాజరవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. గత కొంతకాలంగా సమావేశాలకు దూరంగా ఉంటున్న వైసీపీ ఎమ్మెల్యేలు... ఈసారైనా పాల్గొంటారా..? లేదా అనేది చూడాలి. ఒకవేళ వీరు హాజరైతే... చాలా అంశాలపై వాడీవేడీగా చర్చ జరిగే అవకాశం ఉంటుంది.

## మళ్లీ జగన్ సీఎం అయితేనే

# గిరిజనులకు మంచి రోజులు



**- గిరిజనుల ఆత్మగౌరవం కాపాడింది జగనే**
**- వైఎస్సార్సీపీ హయాంలోనే గిరిజనులకు పెద్దపీట**
**- పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు (మైదాన ప్రాంతం) గుండా సురేంద్ర స్పష్టీకరణ**
**- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం**
**- కూటమి ప్రభుత్వం గిరిజనులకు వెన్నుపోటు పొడిచింది**
**- ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మోసగించింది**
**- రాబోయే రోజుల్లో ఈ వెన్నుపోటు ప్రభుత్వానికి గట్టిగా బుద్ధిచెబుతాం**
**- గిరిజన నాయకుల తీర్మానం**

**తాడేపల్లి ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్**

మళ్లీ జగన్ సీఎం అయితేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని, గత వైఎస్సార్సీపీ హయాంలోనే సంక్షేమం, రాజకీయంగా గిరిజనులకు పెద్ద పీట వేశారని గిరిజన నాయకులు గుర్తు చేశారు.
రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్ ను మళ్ళీ సీఎం చేయడానికి గిరిజనులు అందరూ ఏకం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో నాయకులు పిలుపునిచ్చారు. ముందుగా గిరిజన సాంప్రదాయ నృత్యాలు, పాటలతో పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది. వైఎస్సార్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు (మైదాన ప్రాంతం) గుండా సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను గిరిజన నాయకులు వారి సాంప్రదాయంలో ఘనంగా సత్కరించారు.ఆయనతోపాటు సీఈసీ సభ్యులు శేషగిరిరావు, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గిరిజన సమరయోధులకు పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండా సురేంద్ర మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీల హక్కుల పరిరక్షణ, వారి కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన రోజని పేర్కొన్నారు. గిరిజన బిడ్డల విద్య, వైద్యం కోసం తన ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ గారు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు.

**జగన్ పాలనలోనే గిరిజనులకు మేలు**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గారి హయాంలో గిరిజన సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టినట్లు గుండా సురేంద్ర తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన అనంతరం గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. అదేవిధంగా 157 తండాలు, గూడేలను పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించారని, సుమారు 1,70,000 మందికి 3,20,000 ఎకరాల ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, 25,300 మందికి 38,200 ఎకరాల డీకేటీ పట్టాలు అందించినట్లు వివరించారు. దీంతోపాటు గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ, కురుపాంలో రూ.153 కోట్లతో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశారని, ఐదు ఐటీడీఏల పరిధిలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాలూరులో 561 ఎకరాల్లో ఏపీ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జగన్ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా సుమారు రూ.19,471 కోట్ల నిధులు గిరిజనుల ఖాతాల్లో జమ చేసినట్లు గుండా సురేంద్ర పేర్కొన్నారు.

**వెన్నుపోటు కూటమి పాలనలో గిరిజనులకు అన్యాయం**

**గత ప్రభుత్వాల హయాంలో గిరిజనుల సమస్యలు, హక్కుల పట్ల నిర్లక్ష్యం జరిగిందని రాష్ట్ర గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి కాండ్లావత్ శ్రీనివాస నాయక్ విమర్శించారు.గిరిజనులకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం, టీఏసీ ఏర్పాటు చేయకపోవడం, జీవో నెంబర్ 3 విషయంలో హామీలను అమలు చేయకపోవడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. జీవో నెంబర్ 3ను సుప్రీంకోర్టు కొట్టివేసిన అనంతరం అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, అప్పటి ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి నేతృత్వంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఐటీడీఏల ఏర్పాటు, గిరిజన హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై భవిష్యత్తులో కృషి చేయాల్సిన అవసరం ఉందని గుంటూరు జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి వెంకటసుబ్బయ్య తెలిపారు. మైదాన ప్రాంతంలో ఐటీడీఏల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. 1/70 చట్టం అమలు వంటి అంశాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలంటే రాష్ట్రంలో తిరిగి వైఎస్ జగన్ ని ముఖ్యమంత్రిని చేసుకోవాలని గిరిజన నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ గిరిజన విభాగం ఉపాధ్యక్షుడు ఎన్.**





# సైబర్ కేటుగాళ్లు కొత్త మోసాలు

- హైదరాబాద్ సీపీ సజ్జనార్
- అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్

వృద్ధులే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు భారీ మోసాలకు పాల్పడుతున్నారని.. అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ సూచించారు. 19 నెలల్లో సీనియర్ సిటిజన్ల నుంచి రూ.102.02 కోట్లను సైబర్ క్రిమినల్స్ కాజేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల పరిధిలో 19 నెలల్లో 403 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. 2025 జనవరి నుంచి 2026 జులై 31వ తేదీ వరకు గణాంకాలను వెల్లడించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లలో రూ.55.88 కోట్లను బాధితులు నష్టపోయారని తెలిపారు. ట్రేడింగ్ మోసాలకు సంబంధించి 113 కేసులు నమోదు చేశామని చెప్పుకొచ్చారు. వాట్సాప్, టెలిగ్రామ్‌లలో పార్ట్‌టైమ్ జాబ్స్, భారీ లాభాల పేరుతో సైబర్ క్రిమినల్స్ వల వేస్తారని పేర్కొన్నారు.

**నకిలీ యాప్‌లతో డబ్బులు కాజేస్తారు..**

నకిలీ యాప్‌లలో లాభాలు వచ్చినట్లుగా సైబర్ క్రిమినల్స్ చూపించి డబ్బులు కాజేస్తారని సీపీ సజ్జనార్ వెల్లడించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో 69 కేసులు నమోదయ్యాయని తెలిపారు. రూ.31.93 కోట్లను వృద్ధులు నష్టపోయారని చెప్పారు. పోలీస్, సీబీఐ ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి ఆయా కేసులు, అరెస్టుల పేరుతో బెదిరించి భారీగా సైబర్ కేటుగాళ్లు డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఓటీపీ మోసాల్లో 115 కేసులు నమోదు చేశామని.. ఈ కేసులో రూ.4.94 కోట్లను వృద్ధులు పోగొట్టుకున్నారని వెల్లడించారు. ఆకర్షణీయమైన వడ్డీల పేరుతో ఇన్వెస్‌ట్‌మెంట్ ఫ్రాడ్‌లు చేస్తున్నారని చెప్పారు. పెట్టుబడి మోసాల్లో 22 కేసులు నమోదు చేశామని తెలిపారు. దీని ద్వారా రూ. 2.79 కోట్లను బాధితులు నష్టపోయారని చెప్పారు. డేటింగ్ ఫ్రాడ్, హనీట్రాప్‌లతోనూ వృద్ధులకు వల వేస్తున్నారని తెలిపారు.

**సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయాలు..**

7 కేసుల్లో రూ.70.11 లక్షలకు పైగా వృద్ధులు పోగొట్టుకున్నారని సీపీ సజ్జనార్ అన్నారు. ఒంటరితనాన్ని సైబర్ క్రిమినల్స్ ఆసరాగా చేసుకుని సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుంటున్నారని తెలిపారు. గిఫ్టులు, కస్టమ్స్ డ్యూటీ, అత్యవసర ఖర్చుల పేరుతో డబ్బులు దోపిడీ చేస్తున్నారని అన్నారు. పరువు పోతుందనే భయంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. మరోవైపు పోలీసులు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారని.. దీని ద్వారా సీనియర్ సిటిజన్ల సైబర్ మోసాలు తగ్గాయని వెల్లడించారు.

**సొమ్ము రికవరీకి చర్యలు..**

2025లో 285 కేసులు నమోదయ్యాయని సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసుల్లో రూ. 71.81 కోట్లను బాధితులు నష్టపోయారని అన్నారు. 2026 తొలి 7 నెలల్లో 118 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ కేసులో రూ.30.20 కోట్లను బాధితులు నష్టపోయారని చెప్పారు. నెలకు సగటున 24 కేసుల నుంచి 17 వరకు తగ్గాయని అన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ చేస్తూ చర్యలు చేపడుతున్నామని వివరించారు. సొమ్ము రికవరీకి త్వరితగతిన సైబర్ క్రైమ్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. వృద్ధుల ఫోన్ వినియోగం, బ్యాంక్ లావాదేవీలపై పిల్లల పర్యవేక్షణ అవసరమని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# నక్సలిజం పోయింది

- డీజీపీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు
- డ్రగ్స్ , సైబర్ నేరాలే అతిపెద్ద సమస్య
- లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం
- టీజీ వీర్ యాప్ ప్రారంభం

హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు ప్రధాన సవాలుగా ఉన్న నక్సలిజం పూర్తిగా అంతరించిందని, ప్రస్తుతం సమాజంలో డ్రగ్స్ , సైబర్ నేరాలే అతిపెద్ద సమస్యలుగా పరిణమించాయని రాష్ట్ర డీజీపీ ఆనంద్ స్పష్టం చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా వరంగల్ నిట్ ప్రాంగణంలో పోలీస్ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ, తన ఐపీఎస్ శిక్షణ వరంగల్‌లోనే జరిగిందని, అప్పట్లో నక్సలైట్ల భయాలు, దాడులు , కూంబింగ్ ఆపరేషన్లతో కాలం గడిపామని తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

**లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం.. టీజీ వీర్ యాప్ ప్రారంభం**

అదృష్టవశాత్తూ రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా సమసిపోయిందని, కీలక నేతలతో పాటు క్యాడర్ కూడా లొంగిపోయిందని డీజీపీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పాలసీ ప్రకారం సహాయం అందించి పునరావాసం కల్పించడమే తమ ముందున్న తదుపరి సవాలని చెప్పారు. అలాగే మావోయిస్టు దాడుల్లో మృతిచెందిన బాధిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'టీజీ వీర్' అనే ప్రత్యేక అప్లికేషన్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇక గతంలో నక్సలైట్ల సమస్య కారణంగా రాజకీయ నాయకులకు ఇచ్చిన సెక్యూరిటీపై ప్రస్తుతం రివ్యూ జరుగుతోందని, అవసరం లేని వారికి భద్రత తగ్గించామని వివరించారు. దీనిని ఎవరూ రాజకీయం చేయకూడదని, ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చూడటంలో భాగంగానే స్వయంగా తాను కూడా తన సెక్యూరిటీని తగ్గించుకున్నానని పేర్కొన్నారు.

**సైబర్ క్రైమ్స్, డ్రగ్స్‌పై కఠిన చర్యలు.. విద్యాసంస్థలకూ బాధ్యత**

సమాజంలో ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ , ఆర్థిక నేరాలు ప్రధాన సమస్యలుగా మారాయని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు అధిక లాభాల ఆశతో సైబర్ నేరగాళ్ల బారినపడి రూ.1,750 కోట్లు కోల్పోయారని, వీరిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. ఐతే సైబర్ నేరాల ఛేదనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. డ్రగ్స్ సమస్య పట్టణాల నుంచి గ్రామాలకు పాకుతోందని, విద్యాసంస్థల్లో మత్తు పదార్థాలు తీసుకునే వారిని తాము గుర్తిస్తున్నప్పటికీ యాజమాన్యాలు సరిగా స్పందించడం లేదని, దీనిపై ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, సోషల్ మీడియా అడిక్షన్ వల్ల నేరాలు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణకు పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని డీజీపీ తెలిపారు.



# మూడు ఏళ్లుగా పక్షవాతంలాంటి స్థితి...

- అమోర్ హాస్పిటల్స్ వైద్యుల అరుదైన శస్త్రచికిత్సతో మళ్లీ నడిచిన యువకుడు!
- కుటుంబానికి ఆధారమైన 34 ఏళ్ల వ్యక్తికి నూతన జీవితాన్ని ప్రసాదించిన అరుదైన ఆర్థోపెడిక్ సర్జరీ

హైదరాబాద్, ఆగస్టు, 09:అనంత జనశక్తి న్యూస్



తీవ్రమైన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై, దాదాపు మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన 34 ఏళ్ల వ్యక్తికి అమోర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి, మళ్లీ నడిచేలా చేశారు. జులై 21, 2026న కుడి కాలుకు, జులై 27, 2026న ఎడమ కాలుకు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేసిన వైద్యులు, ప్రస్తుతం సదరు రోగికి పునరావాస (రీహాబిలిటేషన్) చికిత్స అందిస్తున్నారు.మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర తలగాయానికి గురైన ఈ రోగికి గతంలో పలు న్యూరోసర్జరీలు చేసి ప్రాణాలను కాపాడారు. అయితే, కాలక్రమేణా రెండు కాళ్లలో తీవ్ర వైకల్యం ఏర్పడి సొంతంగా నిలబడటానికి, నడవడానికి వీలులేకుండా పోయింది. క్రమంగా అతను పూర్తిగా మంచానికే పరిమితమై, నిలబడటానికి కూడా ఇతరుల సహాయం అవసరమయ్యే స్థితికి చేరుకున్నాడు.అమోర్ హాస్పిటల్‌స్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో రోగికి రెండు తుంటి భాగాలలో 'న్యూరోజెనిక్ హెటెరోటోపిక్ ఆసిఫికేషన్' ఉన్నట్లు నిర్ధారణ అయింది. తీవ్రమైన మెదడు గాయం (బ్రెయిన్ ఇంజ్యూరీ) తర్వాత కండరాలు, మెత్తని కణజాలాలలో అసాధారణంగా ఎముక పెరగడం ఈ వ్యాధి లక్షణం. దీనికితోడు తుంటి, మోకాలు, మడమల వద్ద నరాలు బిగుసుకుపోవడంతో (కాంట్రాక్చర్స్) కాళ్లు పూర్తిగా బిగుసుకుపోయి కదలకుండా తయారయ్యాయి.అమోర్ హాస్పిటల్స్ మల్టీడిసిప్లినరీ ఆర్థోపెడిక్ బృందం ఎంతో సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను దశలవారీగా నిర్వహించేందుకు ప్రణాళిక రచించి, విజయవంతంగా పూర్తి చేసింది. మూడేళ్ల తర్వాత సదరు బాధితుడు మళ్లీ సూటిగా నిలబడి, సహాయంతో నడవగలిగే స్థితికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతనికి బలం, సమతుల్యత మరియు స్వయంసమృద్ధిని పెంచేందుకు ప్రత్యేక ఫిజియోథెరపీ, గెయిట్ ట్రైనింగ్‌తో కూడిన నిపుణుల పునరావాస చికిత్స అందిస్తున్నారు.ఈ శస్త్రచికిత్స విజయంపై అమోర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిషోర్ బి రెడ్డి మరియు వారి బృందం మాట్లాడుతూ.. "తీవ్రమైన బ్రెయిన్ ఇంజ్యూరీ తర్వాత వచ్చే 'న్యూరోజెనిక్ హెటెరోటోపిక్ ఆసిఫికేషన్' అత్యంత సవాలుతో కూడుకున్న సమస్య. అసాధారణంగా పెరిగిన ఎముక కీళ్లను పూర్తిగా బిగదీస్తుంది. ఈ కేసులో అదనంగా పెరిగిన ఎముకను సురక్షితంగా తొలగిస్తూ, బిగుసుకుపోయిన కీళ్లను సరిచేయడానికి పక్కా ప్రణాళికతో కూడిన దశలవారీ శస్త్రచికిత్స అవసరమైంది. మూడేళ్ల తర్వాత రోగి మళ్లీ నిలబడి అడుగులు వేయడం చూడటం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఆధునిక ఆర్థోపెడిక్ పునరుద్ధరణ శస్త్రచికిత్సలు, సరైన రీహాబిలిటేషన్‌తో ప్రాణాల్లో కొత్త ఆశలు నింపి, జీవితాలను మార్చవచ్చని ఇది నిరూపించింది" అని తెలిపారు.సుదీర్ఘకాలం నిశ్చలంగా ఉన్న రోగులకు కూడా సరైన సమయంలో శస్త్రచికిత్స మరియు మల్టీడిసిప్లినరీ రీహాబిలిటేషన్ అందిస్తే మళ్లీ పాత జీవితాన్ని తిరిగి పొందవచ్చని ఈ అరుదైన వైద్య విజయం చాటిచెబుతోంది.

# కొమరం భీమ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



- ఆదివాసీల హక్కులను కాపాడాలి
- అశ్వారావుపేటలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం
- కొమరం భీమ్ విగ్రహావిష్కరణ
- ఆదివాసీ భూముల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేట, ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొమరం భీమ్ ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొమరం భీమ్ ఆశయాలను విగ్రహాలకే పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాలని సూచించారు.

ఆదివాసీల చరిత్ర పోరాటాల చరిత్ర అని సీతక్క అన్నారు. భూమి, అడవి, జలాలపై హక్కుల కోసం తరతరాలుగా పోరాటాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. సమ్మక్క, సారలమ్మ నుంచి కొమరం భీమ్ వరకు అనేక మంది ఆదివాసీ వీరులు హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, రక్షణలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు స్పందించాలని సూచించారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. యువత విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిలో ముందుకు రావాలని సూచించారు.

ఆదివాసీ సమాజ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

అల్లూరి సీతారామరాజు ఆదివాసీల కోసం చేసిన పోరాటం కూడా స్ఫూర్తిదాయకమని సీతక్క పేర్కొన్నారు. ఇతర వర్గాలు, ప్రాంతాల ప్రజలపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు "జల్-జంగల్-జమీన్", "జై కొమరం భీమ్" అంటూ నినాదాలు చేశారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కొమరం భీమ్ విగ్రహానికి నివాళులర్పించారు.



# ఓసీ4లో కార్మికుడి అనుమానాస్పద మృతి

- ఘటనపై సమగ్ర విచారణ జరపాలి
- సింగరేణి జీఎం బాధ్యత వహించాలి

మణుగూరు, ఆగస్టు 9, అనంత జనశక్తి న్యూస్



మణుగూరు ఓసీ4 దుర్గా కంపెనీలో లోడర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాంగ్ బహదూర్ పటేల్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని రేణుక అక్షర మహిళా మండలి నాయకురాలు పూణెం సరోజ డిమాండ్ చేశారు. కార్మికుడు ఎలా మృతి చెందాడనే విషయంపై స్పష్టత లేకపోవడం, ఘటన అనంతరం మృతదేహాన్ని మణుగూరు సింగరేణి ఆసుపత్రికి తీసుకురాకుండా భద్రాచలం ఆసుపత్రికి తరలించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆమె అన్నారు. మృతికి సంబంధించిన వాస్తవాలను దాచే ప్రయత్నం జరుగుతోందా అనే అనుమానాలకు యాజమాన్యం తావివ్వకుండా పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న కార్మికుడు మృతి చెందితే ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా వెల్లడించడం యాజమాన్యం బాధ్యత అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. కార్మికుడి మృతిపై మణుగూరు సింగరేణి జీఎం పూర్తి బాధ్యత వహించి సమాధానం చెప్పాలని పూణెం సరోజ డిమాండ్ చేశారు. జీఎం స్థాయిలో స్పష్టమైన వివరణ ఇవ్వకపోతే సింగరేణి ఉన్నతాధికారులు సంస్థాగత విచారణ చేపట్టాలని కోరారు.

ఓసీ4 దుర్గా కంపెనీలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా, ఘటన జరిగిన వెంటనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. ఘటనాస్థలం నుంచి ఆసుపత్రికి తరలించే వరకు జరిగిన పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించాలని కోరారు. మృతికి అసలు కారణం పోస్టుమార్టం నివేదిక, అధికారిక విచారణ ద్వారా తేల్చాలని పూణెం సరోజ అన్నారు. నిర్లక్ష్యం లేదా తప్పిదం బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత విషయంలో రాజీపడితే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై సింగరేణి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కార్మికులకు భద్రతపై భరోసా కల్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి జనరల్ సెక్రటరీ రెడ్డి బోయిన రేణుక, దేరంగుల సుజాత, బాడిష పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సమైక్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

- ప్రకటనలకే పరిమితం కాకుండా, ఆచరణలో అమలు చేయాలి
- సోందే కుటుంబరావు

మణుగూరు, ఆగస్టు 09, అనంత జనశక్తి న్యూస్ :



గిరిజన సమైక్య ఆధ్వర్యంలో మణుగూరులో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నాడు ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా గిరిజన సమైక్య ఆధ్వర్యంలో " కొమరం భీమ్" విగ్రహానికి, భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ "బి.ఆర్ అంబేద్కర్" విగ్రహానికి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు "చాకలి ఐలమ్మ" విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని గిరిజనుల సమస్యల కోసం కేంద్రంలో రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని, అవి అమలు జరిగినప్పుడే గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేటికీ అనేక గిరిజన గ్రామాలలో కనీసం రహదారి సౌకర్యాలు లేవని, విద్యుత్ సౌకర్యాలు లేవని, పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు అనేక దాడులు కొనసాగిస్తున్నారని, అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులు సాగు చేసుకోకుండా వారినీ కూడా అడవుల నుండి కూడా వెళ్లగొట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఒకవైపు గిరిజనల సంక్షేమం కోసం ఐటిడిఏలు ఏర్పాటు చేస్తే అవి గిరిజనుల సమస్యలు ఎక్కడ పరిష్కారిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఏజెన్సీలలో కనీసం గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి కోట్లాది రూపాయలు నిధులు ఉన్నప్పటికీ, గిరిజనుల పట్ల పాలకులు చిత్తశుద్ధి లేదని వారన్నారు. విద్యా, వైద్యం ఉద్యోగం అవకాశాలు లేక అనేకమంది వలస పడుతూ వలస కూలీలుగా మారుతున్నారని వారు అన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి జీ వో నెంబర్ 3న రద్దు చేసిన ప్లేస్ లో వెంటనే గిరిజన సంక్షేమం కోసం జీవో విడుదల చేయాలని, గిరిజన అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేక గ్రాండ్ విడుదల చేసి రోడ్లు ,వ్యవసాయ బోర్లు, లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్తు, విద్యా, వైద్యం అందించాలని, అర్హులైనటువంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ,వృద్ధాప్య పింఛన్లు అందించాలని వారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇవన్నీ సంక్షేమ ఫలాలు అమలు జరిగినప్పుడే అసలైన గిరిజనులకున్యాయం జరుగుతుందని దీనికోసం పాలకులు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు గిరిజన wసమైక్య మండల కార్యదర్శి వజ వెంకటేశ్వర్లు, నాయకులు కన్నెబోయిన ప్రసాద్, గారబోయిన నరేష్, సున్నం భాను కారం రవి తెల్లం శీను జంపన్న కుంజా సాంబశివరావు మడకం జానీ మరియు అనేక మంది పాల్గొన్నారు.

సోమవారం | అనంతపురం
10.08.2026
అనంత జనశక్తి
07

# ముఖంపై మొటిమలు, మచ్చలు తగ్గించే కలబంద, స్టీమ్ కాంబినేషన్



ప్రకృతి మనకి అందించిన అద్భుతమైన రహస్యాల్లో కలబంద ఒకటి. కలబందను పూర్వకాలం నుంచి అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడే సంజీవనిగా అధ్యయనం పేర్కొంది. నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో తీవ్ర ఒత్తిడి, కాలుష్యం, కలుషిత ఆహారం వంటి కారణాల వల్ల చర్మం తన సహజ సిద్ధమైన మెరుపును కోల్పోతుంది. అలసిన ముఖం, ముఖంపై ముడతలు, మొటిమలు మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అద్దంలో చూసుకున్నప్పుడు మనకే ఒక రకమైన ఆత్మనూన్యత కలుగుతుంది.



అయితే.. ఈ సమస్యలను తొలగించుకోవడానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఎలాంటి ఖర్చు లేకుండా మన ఇంటి దగ్గర లభించే కలబందతో అద్భుతాలు చేయొచ్చు. ముఖ్యంగా వేడినీటి ఆవిరితో కలిపి కలబందను ఉపయోగించడం అనేది ఒక అద్భుతమైన కాంబినేషన్ అనే చెప్పాలి. వేడి నీటి ఆవిరి చర్మ రంధ్రాలను సున్నితంగా తెరిచి లోపలి మురికిని బయటకి పంపితే, కలబంద చర్మ రంధ్రాల లోతుల్లోకి వెళ్లి చర్మానికి ప్రాణం పోస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల ముఖంపై పేరుకున్న మలినాలు తొలగిపోయి చర్మం మృదువుగా మారుతుంది.

**అలోవెరా + హాట్ వాటర్ స్టీమ్ ప్రయోజనాలు**

ముఖానికి ఆవిరి పట్టడం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. అప్పుడు కలబంద జెల్ ఉపయోగించడం వల్ల చర్మ లోపలి పొరల వరకు వెళ్లి పోషణను అందిస్తుంది. చర్మ కణాల్లో పేరుకుపోయిన జిడ్డు, మురికి, మృతకణాలను తొలగిస్తుంది. అంతే కాకుండా అలోవెరాలో సుమారు 95 శాతం నీరు ఉంటుంది.

కాబట్టి ఇది చర్మానికి తేమను అందిస్తుంది. ఇక అలోవెరాలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలు రావడానికి కారణమయ్యే బ్యాక్టీరియాను నశింపజేస్తాయి. అలోవెరా, వేడి నీటి ఆవిరి కాంబినేషన్ రక్తప్రసరణను మెరుగుపరిచి ముఖానికి సహజమైన కాంతిని ఇస్తుంది. చర్మంపై ఉన్న ముడతలను తగ్గించి యవ్వనంగా ఉంచుతుంది.

**అలోవెరా + హాట్ వాటర్ స్టీమ్ ప్రాసెస్**

మొదట ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇప్పుడు కొంచెం కలబంద జెల్ తీసుకుని ముఖంపై ఒక లేయర్‌లా 5 నిమిషాల పాటు మర్దన చేయండి. తర్వాత ఒక గిన్నెలో కొన్ని నీళ్లు తీసుకుని బాగా మరిగించండి. నీళ్లు మరిగాక స్టవ్ ఆఫ్ చేసి ఆ గిన్నెను దించి ఒక చోట పెట్టుకుని ఒక టవల్ లేదా బెడ్‌షీట్ కప్పుకుని గిన్నెలో నుంచి ఆవిరి ముఖానికి తగిలేలా చూసుకోండి.

ముఖాన్ని గిన్నెకు మరీ దగ్గరగా పెట్టకండి. ఇలా ఓ 5 నిమిషాల పాటు ఆవిరి పట్టండి. ఆ తర్వాత ముఖాన్ని శుభ్రంగా కడిగేసుకుని ఒక మెత్తటి గుడ్డతో స్మూత్‌గా తుడుచుకోవాలి. కొద్దిసేపటి తర్వాత మంచి మాయిశ్చరైజర్ రాసుకోండి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పొడి చర్మం ఉండే వాళ్లు వారానికి ఒకసారి, జిడ్డు చర్మం ఉండే వాళ్లు వారానికి రెండు సార్లు చేసుకుంటే సరిపోతుంది.

సున్నితమైన చర్మం ఉన్న వాళ్లు ఆవిరిపట్టే సమయాన్ని 3 నిమిషాలకు కుదించుకోండి. ఆవిరి పడితే చర్మానికి హాయిగా ఉండాలి కానీ మంట పుట్టకూడదు.



కలబంద, వేడినీటి ఆవిరితో పాటు కొంచెం రోజ్ వాటర్ కూడా కలుపుకుంటే మంచి సువాసన ఉంటుంది.

అలోవెరా జెల్ ఉపయోగించే ముందు చేతిపై కొంచెం ప్యాచ్ టెస్ట్ చేసుకోండి.

ఆవిరి పట్టే సమయంలో కళ్లు మూసుకోవడం మంచిది.



# గోధుమ పిండి, శనగ పిండి, మైదా పిండికి పురుగులు పట్టకుండా పాటించాల్సిన చిట్కాలు



వంటిల్లు మన ఆరోగ్య భాండాగారం. వంటింటిలో మనం నిల్వ చేసే ప్రతి వస్తువు వెనుకు ప్రత్యేకమైన శ్రద్ధ అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో పిండి పదార్థాల పాత్ర చాలా కీలకమైనది. ఉదయం, సాయంత్రం పూట చపాతీలు, సాయంత్రం కరకరలాడే బజ్జీలు, నోరూరించే పిండి వంటలు ఇలా ఏది చేయాలన్నా గోధుమ పిండి, శనగ పిండి, మైదా పిండి అవసరం. అయితే ఇక్కడ ఒక సమస్య ఉంది.



అదేమిటంటే.. వీటిని మనం పట్టించుకున్నా, కొనుక్కున్నా పిండి అయినా వాటికి చిన్నపాటి తేమ తగిలినా లేదా నిల్వ చేయడంలో ఏమాత్రం అశ్రద్ధ వహించినా పురుగులు చేరి ఆ పిండిని నాశనం చేస్తాయి. దీనివల్ల ఆ పిండి వృథా అవ్వడమే కాకుండా.. ఆ పిండిని వాడితే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మన అమ్మమ్మలు, నానమ్మలు పిండి నిల్వ చేయడంలో పాటించే చిట్కాలను ఇప్పుడు తెలుసుకుందాం..

**గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ**

సాధారణంగా గోధుమ పిండి, శనగపిండి, మైదా పిండి వంటి వాటిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయాలి. పిండి నిల్వ ఉంచే డబ్బాల మూత వదులుగా ఉంటే గాలి చొరబడి పిండికి పురుగులు పడతాయి. కాబట్టి పిండిని ఎయిర్టైట్ కంటైనర్లలో నిల్ల చేయడం మంచిది.

అయితే పిండిని గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ ఉంచినా సరే.. అప్పుడప్పుడూ బయట తీసి కాసేపు ఎండలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల పిండిలో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. కాబట్టి పిండిని కొద్దిగా ఉపయోగించగానే ప్యాకెట్లలోనే ఉంచకుండా గాలి తగలని డబ్బాల్లో నిల్వ చేయాలి.





**బిర్యానీ ఆకులు, లవంగాలు వేయడం వల్ల..**

సాధారణంగా చెక్క, లవంగాలు, బిర్యానీ ఆకులు వంటి వాటిని మనం బిర్యానీలు మరియు నాన్వెజ్ వంటకాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. అయితే గోధుమ, శనగ, మైదా పిండి స్టోర్ చేసే డబ్బాల్లో రెండు మూడు బిర్యానీ ఆకులు, 4 లేదా 5 లవంగాలు వేయడం వల్ల ఆ వాసనకు పురుగులు దరిచేరవు. దీంతో పిండి ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

**పిండి రకాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి**

చాలా మంది తెలిసో తెలియకో నిల్వ ఉంచిన పిండిలో కొత్తగా తీసుకొచ్చిన పిండిని కలుపుతుంటారు. ఇలా చేయడం వల్ల మొత్తం పిండికి పురుగు పట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి పాత పిండిని మొత్తం ఉపయోగించడం లేదా రెండింటినీ వేరువేరు డబ్బాల్లో నిల్వ చేయడం మంచిది. పిండి నిల్వ ఉంచే డబ్బాలను కడిగి బాగా తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడిచి పూర్తిగా ఆరిన తర్వాత పిండిని నిల్వ చేయాలి.

అలాగే పిండిని నిల్వ చేయడానికి ప్లాస్టిక్ డబ్బాలకు బదులుగా గాజు సీసాలను వినియోగించడం మంచిది. ఇక శనగ పిండి త్వరగా పాడవుతుంది కాబట్టి దీనిని ఫ్రిజ్‌లో నిల్వ చేయడం ఉత్తమం. ఇక గోధుమ పిండి ఎక్కువ మొత్తంలో పట్టించినప్పుడు అందులో కొంచెం ఉప్పు కలిపి నిల్వ చేస్తే పురుగు పట్టదు.

అనంత జనశక్తి
సోమవారం | అనంతపురం
10.08.2026



## మహేశ్ బర్త్‌డే.. క్యూట్ ఫ్యామిలీ ఫొటోతో నమ్రత పోస్ట్..



నేడు అగ్రకథానాయకుడు మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. వారణాసి లుక్‌తో రాజమౌళి విషెస్ చెప్పగా.. స్టార్ నటీనటులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఆయన సతీమణి నమ్రత క్యూట్ ఫ్యామిలీ ఫొటోను పంచుకుని భర్తకు బర్త్‌డే విషెస్ తెలిపారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు MB. మా ప్రతిరోజునూ ఇంత ప్రత్యేకంగా చేసినందుకు ధన్యవాదాలు. నువ్వు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. లవ్ యూ సో మచ్" - నమ్రత శిరోద్కర్

## ఆమిర్‌ను గమనించలేదు.. వైరల్ వీడియోపై ప్రీతి జింటా ఫైర్!



బాలీవుడ్ నటి ప్రీతి జింటా సోషల్ మీడియాలో జరుగుతున్న ఓ ప్రచారంపై తీవ్రంగా మండిపడ్డారు. హీరో ఆమిర్ ఖాన్‌ను ఆమె కావాలనే పట్టించుకోలేదంటూ వైరల్ అవుతున్న ఒక వీడియోపై తాజాగా స్పందించారు. నెగెటివిటీని వ్యాప్తి చేసే ఇలాంటి కంటెంట్‌ను నమ్మొద్దని కోరారు. ఇటీవల ప్రీతి జింటా తన వ్యానిటీ వ్యాన్ నుంచి బయటకు వస్తూ ఫొటోగ్రాఫర్లను దారి అడిగారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఆమిర్ ఖాన్‌ను ఆమె గమనించకుండా వేగంగా వెళ్లిపోయారు. దీన్ని రికార్డ్ చేసిన కొందరు.. 'ఆమిర్ ఖాన్‌ను ప్రీతి జింటా ఇగ్నోర్ చేసింది' అంటూ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు.
ఈ వీడియోపై ప్రీతి అదే పోస్ట్ కామెంట్ సెక్షన్‌లో ఘాటుగా బదులిచ్చారు. "క్లిక్‌బైట్ కోసం ఇలాంటి పనులు చేయడం ఏమాత్రం సరికాదు. లోపల కొన్ని షాట్స్ త్వరగా ముగించుకుని, 'బట్వారా 1947' సినిమా ప్రమోషన్స్ కోసం ఫ్లైట్ అందుకోవాలనే కంగారులో ఉన్నాను. అందుకే ఆమిర్‌ను గమనించలేదు. ఇలా నెగెటివిటీని ప్రచారం చేయడమే మీ ఉద్దేశమైతే.. ఇకపై ఫోటోల కోసం నేను ఆగుతానని మీరెవరూ ఆశించకండి. ఆమిర్ అంటే నాకుఎంతో ప్రేమ, అపారమైన గౌరవం ఉన్నాయి. ఇలాంటి ప్రచారాలు ఏమాత్రం బాగోలేవు" అని ఆమె అసహనం వ్యక్తం చేశారు.
దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత ప్రీతి జింటా 'బట్వారా 1947' చిత్రంతో వెండితెరపైకి రీఎంట్రీ ఇస్తున్నారు. 1947 దేశ విభజన నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయనే స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. గతంలో ప్రీతి జింటాతో కలిసి 'ది హీరో', 'ఫర్జ్', 'హీరోస్' వంటి చిత్రాల్లో నటించిన సన్నీ దేవోల్.. ఈ మూవీలో హీరోగా నటిస్తున్నారు. షబానా అజ్మీ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ చిత్రం ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## ఆ విషయంలో నాకు భయం.. అందుకే 'టాక్సిక్' మొదట వద్దనుకున్నా: నయనతార



తాను మొదట 'టాక్సిక్' సినిమాకు అంగీకరించలేదని నయనతార అన్నారు. దర్శకురాలు తనను ఎన్నో ప్రశ్నలు వేశారని ఆమె తెలిపారు. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్'ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నయనతారతో పాటు కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి కొన్ని విషయాలు పంచుకున్నారు. 'టాక్సిక్'లో నయనతార 'గంగ' అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపిస్తున్న విషయం తెలిసిందే. సినిమా గురించి ఆమె మాట్లాడుతూ.. "గీతు ఈ ప్రాజెక్ట్ కోసం ఫోన్ చేసినప్పుడు నేను అంత ఆసక్తి చూపలేదు. ఎందుకంటే ఈ సినిమాలో చాలా మంది నటీనటులు ఉన్నారు. సాధారణంగా ఎక్కువ మంది స్టార్లు ఉన్న సినిమాలను ఎంచుకోవడానికి కొంచెం భయపడతాను. అందుకే 'నేను ఈ సినిమా చేయలేను' అని చెప్పేశాను. కానీ, గీతు నన్నుఎన్నో ప్రశ్నలు అడిగారు. చివరికి 'సరే వచ్చి కథ చెప్పండి' అని అంగీకరించా. కథ వినిపించిన క్షణం నుంచి నా ఆలోచన మారిపోయింది. ఇంత గొప్ప దర్శకురాలిని మనం ఇప్పటివరకూ ఎందుకు చూడలేదు అనిపించింది. యశ్ ఈ సినిమా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. తన జీవితంలో 4,5 ఏళ్ల కష్టాన్ని, సమయాన్ని ధారపోశారు. తన కుటుంబం, పిల్లలు, వ్యక్తిగత సంతోషాలను పక్కనపెట్టి సినిమా కోసమే జీవించారు" అని నయతార ప్రశంసించారు. ఇక ఈ సినిమాలో నటించిన కియారా అడ్వాణీ , రుక్మిణి వసంత్ కూడా టాక్సిక్ గురించి మాట్లాడారు. ఈ సినిమా తన కెరీర్‌ను మలుపు తిప్పతుందని కియార అన్నారు. "ఒక నటిగా నేను ఎంత గొప్ప సాహసం చేయగలనో నాకే తెలియని సమయంలో.. యశ్ నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చారు. ఈ సినిమా తర్వాత 'టాక్సిక్' కంటే ముందు, తర్వాత కియార అని చెప్పేలా నా కెరీర్ మారబోతోంది. చిత్రబృందం నన్ను ఎంతో గారాబంగా చూసుకుంది. ఈ సినిమాలో నటించిన తర్వాత ఇలాంటి మంచి పాత్రలు చేయాలనే తపన పెరిగింది. అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో 'టాక్సిక్' రూపొందించాం" అని కియార అన్నారు. 'టాక్సిక్' అంగీకరించినప్పటి నుంచి తనను అందరూ చాలా గొప్పగా చూస్తున్నారని హ్యూమా ఖురేషి అన్నారు. ఎక్కడకు వెళ్లినా ఈ సినిమా గురించే అడుగుతున్నారని తెలిపారు. ఈ సినిమాలో నటించడమే తన విజయంగా భావిస్తానని రుక్మిణి వసంత్ అన్నారు. యశ్ అభిమానిగా తాను ఈ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు చెప్పారు.

## సిద్ధుతో మీనాక్షి

'సంక్రాంతికి వస్తున్నాం', 'అనగనగా ఒక రాజు' చిత్రాలతో వరుస విజయాలందుకుని జోరుమీదుంది మీనాక్షి చౌదరి. ఇప్పుడామె తెలుగులో నాగచైతన్యతో 'వృషకర్మ'లో నటిస్తూనే.. మరోవైపు కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో కార్తితో ఓ సినిమా చేస్తోంది. అయితే ఇప్పుడామె ఖాతాలో మరో ప్రాజెక్ట్ చేరింది. తను త్వరలోనే తెలుగులో తొలి వెబ్‌సిరీస్‌తో అలరించనుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సిరీస్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి కథానాయికగా నటిస్తున్నట్లు దర్శకుడు వెంకీ స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఈ వెబ్‌సిరీస్ చిత్రీకరణ మొదలైందని.. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముందని తెలియజేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.


సిద్ధు
మీనాక్షి చౌదరి

## ఏ ఒక్కరినీ బలిపశువుగా చూపడం సరికాదు: వీవీఎస్ లక్ష్మణ్



టీమ్ఇండియాలో గాయాల బెడద పెరుగుతున్న నేపథ్యంలో బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. ఆ విమర్శలపై సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందించాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కేవలం ఒక పునరావాస నిర్వహణ కేంద్రంగా మాత్రమే చూడకూడదని, క్రికెటర్లు రాణించడానికి సహాయపడటం కూడా తమ బాధ్యతలలో భాగమని పేర్కొన్నాడు. ఆదివారం బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సీఓఈని సందర్శించిన అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడాడు.
"ఏ క్రీడాకారుడి కెరీర్‌లోనైనా గాయాలు సర్వసాధారణం. ఈ విషయంలో ఏ ఒక్క వ్యక్తిని గానీ, విభాగాన్ని గానీ బలిపశువుగా చూపడం సరికాదు. సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్ సిబ్బంది, సెలక్షన్ కమిటీ మధ్య సమన్వయం అద్భుతంగా ఉంది. ఆటగాడి ఫిట్‌నెస్ స్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు సెలక్షన్ కమిటీకి అందుతాయి. పునరావాస ప్రక్రియలో ఆటగాడి పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోతే వెంటనే సెలక్షన్ కమిటీ, కోచ్‌లకు సమాచారం అందిస్తాం. బుమ్రా, సాయి సుదర్శన్‌లను ఫిట్‌నెస్ సాధిస్తేనే జట్టులోకి తీసుకోవాలని ఉద్దేశంతోనే ఎంపిక చేశారు. ఒకవేళ వారు ఫిట్‌నెస్ పరీక్షలో అర్హత సాధించకపోతే వారి స్థానంలో ఎవరి తీసుకోవాలో సెలక్టర్లకు ముందే తెలుస్తుంది. ఇందులో ఎలాంటి గందరగోళం లేదు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, ఆటగాడు-జట్టు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతుంది" అని లక్ష్మణ్ వివరించాడు.
శ్రీలంకతో టెస్టు సిరీస్ (ఆగస్టు 15) సమయానికల్లా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్ పూర్తిగా కోలుకుంటారని సెలక్టర్లు వారిని జట్టులోకి ఎంపిక చేశారు. కానీ బుమ్రా మోకాలిలో నీరు చేరడంతో అతడికి నయమవడానికి ఇంకాస్త సమయం పడుతుందని టెస్టు సిరీస్ నుంచి తప్పించారు. సుదర్శన్ కాలి వేలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడూ సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

## వైభవ్‌కు నిజంగానే 15 ఏళ్లేనా? అనుమానాలపై బ్రెట్‌లీ ఆసక్తికర కామెంట్స్



ప్రపంచ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్. కేవలం 15 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఈ క్రమంలో ఆసీస్ మాజీ స్టార్ పేసర్ బ్రెట్ లీ వైభవ్ టాలెంట్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. సూర్యవంశీ వయసుపైనా బయట చాలా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించాడు. కానీ, అతడి నైపుణ్యం, ఫామ్‌ను చూస్తుంటే ముచ్చటేస్తోందని తెలిపాడు. "వైభవ్ సూర్యవంశీ ఓ అద్భుతం. విదేశాల్లో చాలా మంది వైభవ్ వయసు గురించి ప్రశ్నిస్తూ ఉంటారు. అతడికి నిజంగానే 15 ఏళ్లేనా? ఎందుకంటే చూసేందుకు 17 లేదా 18 ఏళ్ల కుర్రాడిలా కనిపిస్తాడనేది వారి అభిప్రాయం. కానీ, నేనెప్పుడూ అతడి వయసు గురించి ఆలోచించలేదు. కేవలం బ్యాటింగ్ సత్తానే చూస్తా. అతడి ఏజ్ ఎంతైతే ఏంటి? కుర్రాడు అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నాడు. భారత్‌కు దొరికిన మంచి ఆటగాడు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆశిస్తున్నా. ఐపీఎల్‌లోనే అతడి నైపుణ్యం ఏంటో చూశాం. సన్‌రైజర్స్‌పై 97 పరుగుల ఇన్నింగ్స్ సూపర్. ఆసీస్‌కు చెందిన స్టార్ బౌలర్లపైనా విరుచుకుపడ్డాడు. క్రికెటింగ్ షాట్లకు పవర్‌హిట్టింగ్ తోడైతే ఎలా ఉంటుందో అలా ఉంది. అయితే, అతడు ఇంకా చిన్న పిల్లాడే. లేనిపోని ఒత్తిడిని దరిచేరనీయొద్దు. హుక్ లేదా పుల్లర్ షాట్లను కొట్టే ఆటగాళ్లంటే నాకు ఇష్టం. వారికి బౌలింగ్ చేసేందుకు ఇష్టపడతా. పోటీ బాగుంటుంది. ఒక బంతికి సిక్స్ కొట్టినా నిరుత్సాహపడను. మళ్లీ అదే బాల్ వేసేందుకు ప్రయత్నిస్తా" అని బ్రెట్‌లీ స్పష్టం చేశాడు.
బెస్ట్ బ్యాటర్ సచిన్.. బెస్ట్ క్రికెటర్ కలిస్
"క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్ ఎవరంటే మాత్రం సచిన్ తెందుల్కర్ అని ఎప్పుడో చెప్పా. కానీ, బెస్ట్ క్రికెటర్ మాత్రం దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెలిస్ కలిస్ అని చెబుతా. అతడి గణాంకాలే ఆ మాట చెబుతాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించాడు. ఎంతటి క్లిష్టపరిస్థితులైనా కలిస్ చాలా ప్రశాంతంగా ఉంటాడు" అని బ్రెట్ లీ తెలిపాడు.

## షేన్ వాట్సన్ పుస్తకమే స్ఫూర్తి..: యువ ఆర్చర్ సాహిల్ జాధవ్



భారత యువ ఆర్చర్ సాహిల్ జాధవ్ సన్నద్ధత ఆసియా గేమ్స్‌లో పతకమే లక్ష్యంగా సాగుతోంది. తాను ఓ నెల కిందట ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ రచించిన పుస్తకం చదివానని.. తనకెంతో స్ఫూర్తిగా అనిపించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 26 ఏళ్ల సాహిల్ వెల్లడించాడు. అదే ఇన్‌స్పిరేషన్‌తోనే రాబోయే ఆసియా గేమ్స్‌కు సన్నద్ధమవుతున్నట్లు తెలిపాడు.
"షేన్‌వాట్సన్ పుస్తకం 'ద విన్నర్స్ మైండ్‌సెట్' నెల రోజుల కిందట చదవడం మొదలుపెట్టా. మొదట నా ఉద్దేశం ఫోన్ వాడకం తగ్గించడమే. అందుకోసం పుస్తకం చదివేందుకు మొగ్గు చూపా. అయితే, ఆ బుక్ రీడ్ చేస్తున్నప్పటి నుంచి చాలా విలువైన జ్ఞానం సంపాదించా. పోటీల సమయంలో ఉండే ఒత్తిడిని ఎలా డీల్ చేయాలో తెలుసుకోగలిగా. వచ్చే ఆసియా గేమ్స్‌లో నాకు తప్పకుండా ఆ సమాచారం ఉపయోగపడుతుందని భావిస్తున్నా" అని జాధవ్ వెల్లడించాడు.
ఆలస్యంగా టైటిల్ అందుకొని..
"ఆర్చరీ కెరీర్‌ను ఆలస్యంగా 19 ఏళ్ల వయసులో మొదలుపెట్టా. ఆ సమయంలో నా ఫ్యామిలీ చాలా మద్దతుగా నిలిచింది. నా కోసం త్యాగాలు చేసింది. జాతీయ స్థాయిలో తొలి పతకం సాధించేందుకు దాదాపు ఏడేళ్ల సమయం తీసుకున్నా. అప్పటి వరకూ మానసిక క్షోభ అనుభవించా. కానీ, నా కుటుంబం మాత్రం అండగా నిలిచింది. కానీ, ఇదే ఏడాది ఆర్చరీ వరల్డ్ కప్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం సాధించా. మెడల్ కోసం పోడియం ఎక్కినప్పుడు నా కళ్ల ముందు తల్లిదండ్రులు.. వారు చేసిన త్యాగాలు కనిపించాయి" అని గుర్తు చేసుకున్నాడు.
చాలా క్లిష్టం..
"ఏదైనా మెగా టోర్నీలో తలపడాలంటే ట్రయల్స్‌లో ఎంపిక కావాలి. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ట్రయల్స్ భారత్‌లోనే ఉంటాయి. ఇక్కడ పోటీ కూడా చాలా ఎక్కువ. ఒక్కసారి టీమ్ఇండియా స్క్వాడ్‌లోకి వచ్చామంటే.. అంతర్జాతీయంగా ఎంతటి జట్టునైనా ఓడించగలం. కొన్నిసార్లు ఒత్తిడికి గురై స్వల్ప తేడాతో పతకాలను కోల్పోయిన సందర్భాలను చూశాం. గత పొరపాట్ల నుంచి ఈసారి బయటపడి.. వందశాతం శ్రమించి పతకాలను గెలుస్తాం" అని జాధవ్ స్పష్టం చేశాడు.

## వరల్డ్ నంబర్ 1 టెన్నిస్ ప్లేయర్ ఆర్యనా సబలెంకాకు షాక్

మహిళా టెన్నిస్ నంబర్ వన్ ప్లేయర్ ఆర్యనా సబలెంకా(Aryna Sabalenka)కు టొరంటో మాస్టర్స్‌లో షాక్ తగిలింది. నాలుగో రౌండ్‌లోనే ఆమె ఇంటిముఖం పట్టింది. ఆమెతోపాటు మరో స్టార్ జెస్సికా పెగులా కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరికొద్ది రోజుల్లో యూఎస్ ఓపెన్ ప్రారంభం కానుంది. ఇలాంటి సమయంలో సబలెంకాకు చుక్కెదురైంది. రష్యాకు చెందిన 16వ సీడ్ ఎకటెరినా అలెక్జాండ్రోవా 7-6 (7/3), 4-6, 6-4 తేడాతో సబలెంకాపై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్విటోలినాతో ఎకటెరినా తలపడనుంది.
పెగులా ఓటమి..
రష్యాకు చెందిన 15వ సీడ్ ష్నైడర్ చేతిలో వరల్డ్ నంబర్ 3 ప్లేయర్ జెస్సికా పెగులా ఓడిపోయింది. కేవలం 73 నిమిషాల్లోనే పెగులాను 23 ఏళ్ల ష్నైడర్ ఓడించడం గమనార్హం. ష్నైడర్ 6-2, 6-4 తేడాతో వరుస సెట్లలో పెగులాపై విజయం సాధించింది. ఇక క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ ప్లేయర్ ఇగా స్వేటెక్‌తో ష్నైడర్ తలపడనుంది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314